ఉష్ణోగ్రత (అంచనా)

30-5-2025	గరిష్టం	కనిష్టం
గుంటూరు	34	27
తెనాలి	34	27
నరసరావుపేట	33	27
బాపట్ల	34	28
రెంటచింతల	35	27
చీరాల	34	28





విద్యాకిట్లు.. వచ్చేశాయ్

- ఎమ్మార్సీ కేంద్రాలకు చేరిన విద్యా కిట్లు
- ఈ ఏడాది నుంచి రెండు సెమిస్టర్ల విధానం
- ప్రభుత్వ బడుల్లో తగ్గనున్న బ్యాగ్ బరువు

గుంటూరు (విద్య), మే 29 (ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం మరో రెండు వారాల్లో ప్రారంభం కానున్నది. బడి ప్రారంభం రోజునే విద్యార్థులకు పుస్తకాలు ఇచ్చేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. రెండు వారాలు ముందుగానే గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లా కేంద్రాలకు పాఠ్య పుస్తకాలు, వర్క్‌బుక్స్‌ను ప్రభుత్వం సరఫరా చేసింది. వీటిని ఆయా మండలాల పరిధిలోని విద్యా వనరుల కేంద్రాలకు తరలించేందుకు జిల్లాస్థాయిల్లో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని మండలాల్లో విద్యా వనరుల కేంద్రాలకు ఆయా పుస్తకాలను తరలించారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా కిట్లు పేరుతో ప్రభుత్వం ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు పంపిణీ చేయనున్నది. ఈ కిట్లలో రెండు స్కూల్ యూనిఫామ్, బ్యాగు, బూట్లు, టై తదితరాలతో పాటు తరగతుల వారీగా పాఠ్య, నోట్ పుస్తకాలు, డిక్షనరీ ఉంటాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో మండల పరిషత్, ప్రభుత్వ, జడ్పీ, ఎయిడెడ్ యాజమాన్యాల ఆధ్వర్యంలో దాదాపు వెయ్యికి పైగా (మిగతా 6లో)

1150 మందికి ఆర్టీఈ అడ్మిషన్లు

విద్యా హక్కు చట్టం ప్రవేశాల తొలి జాబితా విడుదల

గుంటూరు(విద్య), మే 29 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు విద్యా హక్కు చట్టం(ఆర్టీఈ) ద్వారా ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో దరఖాస్తు చేసుకున్న వారి నుంచి ప్రవేశాలు పొందిన విద్యార్థుల జాబితాను విద్యాశాఖ గురువారం విడుదల చేసింది జిల్లాలో 1150 మంది విద్యార్థులు ఈ చట్టం ద్వారా ప్రైవేటు పాఠశాలల్లో చేరనున్నారు. ఇందులో ఎస్సీ 347 మంది, ఎస్టీ 49 మంది, బీసీలు 409, ఈబీసీలు 116, ఓసీలు 177 మంది, అనాథ విద్యార్థులు ఇద్దరు ఈ ఏడాది ఈ చట్టం ద్వారా ప్రైవేట్ పాఠశాలల్లో అడ్మిషన్ పొందనున్నారు. మండలాల వారీగా చూస్తే చేబ్రోలులో 8, దుగ్గిరాల 23, గుంటూరు 336, గుంటూరు ఈస్ట్ 347, కొల్లిపర 21, మంగళగిరి 126, మేడికొండూరు 26, పెదకాకాని 41, పెదనందిపాడు 2, ఫిరంగిపురం 9 పొన్నూరు 11, ప్రత్తిపాడు 3, తాడికొండ 20, తెనాలి 93, తాడేపల్లి 40, తుళ్లూరు 38, వట్టిచెరుకూరు మండలం నుంచి నలుగురు విద్యార్థులు అడ్మిషన్ పొందనున్నారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న బంధువులు

మరణంలోనూ తోడు

- రోడ్డు ప్రమాదంలో తోడికోడళ్లు దుర్మరణం
- మేదరమెట్ల దగ్గర ప్రమాదం.. తెనాలివాసులు ముగ్గురు మృతి
- అరుణాచలం వెళ్తుండగా ఘటన.. మూడు కుటుంబాల్లో తీరని శోకం

తెనాలి, మే 29, (ఆంధ్రజ్యోతి): వారు ముగ్గురూ తోడికోడళ్లు.. వేర్వేరు కుటుంబాల నుంచి వచ్చారు.. ప్రేమ, ఆప్యాయతలతో అక్కచెల్లెళ్లను మరిపించారు. చివరకు ఆ మరణంకూడా విడదీయలేకపోయింది. వారి సంతోషాన్ని విధి చూసి ఓర్వలేక రోడ్డు ప్రమాదంలో ముగ్గురు జీవితాలను కాటేసింది. గురువారం జరిగిన రోడ్డు ప్రమాదం ముగ్గురు తోడికోడళ్ల మృతితో తెనాలిలో విషాదం అలుముకుంది. మూడు కుటుంబాల్లో శోకం మిగిల్చింది. తెనాలికి చెందిన కన్నెగంటి నరసింహారావుకు వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు సోదరులు. వీరంతా తెనాలిలో వ్యాపార, విద్యా సంస్థల నిర్వహణలో చెంచుపేట నందులపేట ప్రాంతాల్లో స్థిరపడ్డారు. వీరు ముగ్గురూ సూర్యకుమారి(62), సరస్వతి(65), ఝాన్సీరాణి(60)లను వివాహం చేసుకున్నారు. ఒక్కొక్కరికి ఇద్దరేసి సంతానం. వారందరికీ కూడా వివాహాలయ్యాయి. ముగ్గురూ 60 పదుల వయస్సులో భర్తలతో సంతోషంగా శేషజీవితం గడుపుతున్నారు. ఈ క్రమంలో అరుణాచలేశ్వరుని దర్శించుకోవాలనే ఆలోచనతో ఈ ముగ్గురు తోడికోడళ్లు ఆడబిడ్డ పార్వతితో కలిసి ఝాన్సీరాణి కుమారుడి కారులో గురువారం ఉదయం అరుణాచలం బయలుదేరారు. బాపట్ల జిల్లా మేదరమెట్ల దగ్గర డివైడర్‌ను కారు ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే ముగ్గురు తోడికోడళ్లు మృతి చెందారు. మిగిలిన ఇద్దరికి తీ వ్ర గాయాలయ్యాయి. కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. ఇంటి నుంచి బయల్దేరిన కొద్దిసేపటికే ప్రమాదం గురించి తెలిసి ఆయా కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు.



ప్రమాద స్థలిలో నుజ్జునుజ్జయిన కారు

ఖరీఫ్‌పై... కదలరా?



- విత్తన కేటాయింపుల్లో రాని స్పష్టత
- కొలిక్కిరాని కాల్వల మరమ్మతుల పనులు
- రైతులు సిద్ధమైనా వ్యవసాయశాఖలో లోపించిన సన్నద్ధత
- పంటల డిమాండ్‌పై రైతులకు దిశానిర్దేశం చేసే వారే కరువు
- విత్తన నాణ్యత ధ్రువీకరణ నుంచి భూసార పరీక్షల వరకు నిర్లక్ష్యం

వరుణుడు కరుణించాడు.. మేఘాలు వర్షిస్తున్నాయి.. చినుకులతో భూమాత పులకిస్తోంది.. రైతులు ముందస్తు సాగుకు సన్నద్ధమవుతున్నాడు.. అయితే ప్రభుత్వ పరంగా యంత్రాంగంలో ఖరీఫ్‌పై ఇంతవరకు కదలికే లేదు. గత రెండు సీజన్లలో ఆలస్యంగా ఖరీఫ్ ఆరంభం కావడం.. దిగుబడులు చేతికి వచ్చే సమయంలో ప్రకృతి వైపరీత్యాలతో రైతులు చాలావరకు నష్టపోయారు. ఈ ఏడు ముందస్తు రుతుపవనాలతో ముందస్తుగా సాగు చేపట్టి ప్రకృతి వైపరీత్యాలను తప్పించుకోవాలని రైతులు ఆశించగా యంత్రాంగం నుంచి సహకారం లేదని తేటతెల్లమవుతోంది. విత్తనాలు, ఎరువులు, భూసార పరీక్షలు, విత్తన నిర్ధారణ పరీక్షలు, కాల్వల మరమ్మతులు.. ఇలా అన్ని విషయాల్లోనూ ఆయా విభాగాల అధికారుల్లో నిర్లక్ష్యం కనిపిస్తోంది. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ముందస్తు ఖరీఫ్ సత్ఫలితాలు సాధించాలంటే ఆయా విభాగాల మధ్య సమన్వయం కూడా ఎంతో కీలకం. ప్రస్తుతం అది లోపించడం కూడా అన్నదాతలకు శాపంగా మారింది. వ్యవసాయ, ఉద్యాన శాఖలతో పాటు ఇరిగేషన్ విభాగాలు సమన్వయంతో అడుగులు వేయాల్సి ఉండగా క్షేత్రస్థాయిలో ఇదెక్కడా కనబడటంలేదు.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఏటా జూన్ మూడో వారంలో ఖరీఫ్ ఊపందుకుంటోంది. అయితే ప్రస్తుతం వానలు ముందుగానే పలకరించాయి. దీంతో ఖరీఫ్ పనులు జూన్ ఆరంభం నుంచే ప్రారంభం కానున్నాయి. ముందస్తు ఖరీఫ్ సాగు చేపట్టడం ద్వారా ఏటా అక్టోబరు, నవంబరు నెలల్లో వచ్చే ప్రకృతి విపత్తులను కొంతమేర తప్పించుకోవచ్చు. దీంతో పాటు ఖరీఫ్ ముందస్తు సాగు ద్వారా సీజన్‌లో మూడో పంట సాగును రైతులు చేయవచ్చనేది ఈ ముందస్తు ప్రణాళికల్లో భాగం. అయితే ఇందుకు కావాల్సిన అన్ని సహాయ సహకారాలను వ్యవసాయ శాఖ నుంచి ప్రభుత్వం కల్పిస్తుందని అన్నదాతలకు భరోసా ఇచ్చారు. కానీ ఆశించిన స్థాయిలో ముందస్తు ఖరీఫ్‌పై సదరు విభాగం సన్నద్ధత కనబడడం లేదు. విత్తనాల నాణ్యతను ఈ సారి పూర్తి స్థాయిలో పరిశీలించాలనే ఆదేశాలు ఇప్పటికే ప్రభుత్వం ఇచ్చింది. కానీ ఆ దిశగా ఎక్కడా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో వరి, మిరపతో పాటు పత్తి పెద్దఎత్తున సాగు చేస్తుంటారు. ఆయా కంపెనీలు సీజన్ ఆరంభంలోనే విత్తన నాణ్యత ధ్రువీకరణ పత్రాలను వ్యవసాయశాఖకు (మిగతా 6లో)

ఖరీఫ్ సాగు విస్తీర్ణం

బాపట్ల జిల్లాలో మొత్తం 2,67,469 ఎకరాల్లో ఖరీఫ్ సీజన్ సాగు ఉండనుందనేది వ్యవసాయ శాఖ అంచనా. దీనికి 65,000 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు అదనం. గుంటూరు జిల్లాలో 1.24 లక్షల హెక్టార్లలో పంటలు సాగవుతాయనే అంచనా. పల్నాడు జిల్లాలో 4.60 లక్షల ఎకరాలుగా వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడం ఎత్తైతే మిగులు వర్షపాతం నమోదవుతుందనే అంచనాలను ఐఎండీ చెబుతుండడంతో రైతులు ఖరీఫ్ సాగుపై పెద్దఎత్తున ఆశలు పెట్టుకున్నారు.

ఇలాగైతే ఎలా?

- ఇప్పటి వరకూ విత్తన నాణ్యత పరిశోధన జాడేలేదు.
- ఏ పంట సాగుకు మట్టి అనుకూలమో చెప్పే భూసార పరీక్షలు ప్రహసనాన్ని తలపిస్తున్నాయి తప్పితే రైతులకు జరిగే మేలు శూన్యంగా కనబడుతోంది.
- రాయితీ విత్తనాలు, ఎరువుల నిల్వలపై ఇప్పటికీ వ్యవసాయశాఖ దగ్గర ఓ నిర్దిష్ట ప్రణాళిక లేదు.
- కాల్వల మరమ్మతుల పనులు ప్రారంభమైనా నిర్దిష్ట గడువు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.
- సీసీఆర్‌సీ కార్డులు, సేద్యానికి సంబంధించి వార్షిక రుణ ప్రణాళికలు కార్యరూపం దాల్చలేదు.

దీపం-2 నగదేది?

- రెండు నెలలైనా అందని సొమ్ము
- ఇప్పటికే పూర్తయిన లక్షలాది బుకింగ్స్
- నగదు కోసం లబ్ధిదారుల ఎదురుచూపు
- తొలివిడతలో వెంటనే.. జాడలేని రెండోవిడత

గుంటూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్‌లో దీపం-2 పథకం రెండో విడత నగదు రెండు నెలలుగా అమలుకు నోచుకోలేదు. రాష్ట్ర ప్రభు త్వం ఈ పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించినా రెండో విడతలోనే పిల్లిమొగ్గలు వేసిందని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. తొలివిడత ఉచిత సిలిండర్ కింద లబ్ధిదారులకు బుక్ చేసుకున్న వెంటనే అందిన నగదు రెండో విడతలో ఇప్పటి వరకూ అమలుకు నోచుకోలేదు. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. గత నవంబరులో దీపం- 2 పథకాన్ని ప్రారంభించిన ప్రభుత్వం 2025 మార్చి 31 వరకూ స్కీమును అమలు చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా తొలి విడతలో ఒక్కొక్కరికి రూ.835 చొప్పున రూ.116 కోట్లు చెల్లించింది. తొలివిడత గ్యాస్ సిలిండర్ డెలివరీ అయిన 48 గంటల్లోనే లబ్ధిదారుల ఖాతాలో నగదు పడింది.

● ఈ ఏడాది తొలి సిలిండర్ డబ్బులేవి?


ఈ ఏడాది తొలి ఉచిత సిలిండర్ పొందేందుకు ఏప్రిల్ 1 నుంచి జూలై నెలాఖరు వరకూ గడువును నిర్ణయించింది. అయితే దీనికి సంబంధించిన నిధులు ఇప్పటి వరకూ లబ్ధిదారులకు అందలేదు. తొలివిడత ఉచిత సిలిండర్ పొందిన 14 లక్షల మంది లబ్ధిదారుల్లో సగం మంది ఏప్రిల్, మే నెలల్లోనే బుకింగు చేసుకున్నా చాలామందికి రెండు నెలలైనా (మిగతా 6లో)



కౌన్సెలింగ్.. కాలయాపన

- గందరగోళంతో ఉపాధ్యాయ సంఘాల ఆందోళన
- కమిషనరేట్ ఆదేశాలతో అర్ధరాత్రి వరకు సాగిన ప్రక్రియ

గుంటూరు(విద్య), మే 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరుకు సంబంధించి స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల కౌన్సెలింగ్ గురువారం స్థానిక భారతీయ విద్యా భవన్‌లో జరిగింది. మొత్తం 59 పోస్టులకు 1:3 నిష్పత్తిలో 200 మంది ఉపాధ్యాయులను బుధవారం కౌన్సెలింగ్‌కు పిలిచారు. అయితే సాంకేతిక కారణాల వల్ల కౌన్సెలింగ్‌లో జాప్యం చోటుచేసుకుంది. అసహనానికి గురైన ఉపాధ్యాయులు వెళ్లిపోయారు. గురువారం కౌన్సెలింగ్ ఉంటుందని రావాలని బుధవారం సాయంత్రం ఉపాధ్యాయులకు సమాచారం పంపారు. ఉదయం 8 గంటలకే ఉపాధ్యాయులు కౌన్సెలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. అయితే సాయంత్రం వరకు కూడా కమిషనరేట్ నుంచి పదోన్నతుల కోసం అనుమతి రాలేదు. కౌన్సెలింగ్‌లో జరుగుతున్న కాలయాపన, గందరగోళంతో అసహనానికి గురైన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నేతృత్వంలో ఆందోళనకు దిగారు. వయోభారం కారణంగా పలువురు ఇబ్బందులు పడుతున్నారని అయినా విద్యాశాఖ స్పందించడం లేదని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సాంకేతిక సమస్యలు పరిష్కరించకపోగా ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేయడం ఏమిటని ప్రశ్నించారు. అయితే కౌన్సెలింగ్‌కు సంబంధించిన ఆదేశాలు గురువారం సాయంత్రం ఏడు గంటలకు రాగా అప్పటికప్పుడు కౌన్సెలింగ్ చేపట్టారు. దీంతో గురువారం పొద్దుపోయే వరకు ప్రక్రియ కొనసాగింది.



కౌన్సెలింగ్ కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు

రత్నాలచెరువులో కార్డెన్ సెర్చ్

సరైన పత్రాలు లేని 85 బైకులు స్వాధీనం

మంగళగిరి సిటీ, మే 29 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పట్టణ పరిధిలోని రత్నాలచెరువులో గురువారం పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఏఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో 120 మంది పోలీసులు, బృందాలుగా విడిపోయి తనిఖీలు చేపట్టారు. అనుమానితుల వివరాలను సేకరించి వారి ఆధార్ కార్డులతో ఆన్‌లైన్‌లో సరిచూశారు. ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేని 85 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ చర్యల్లో భాగంగా సంఘ వ్యతిరేక శక్తులను కట్టడి చేసి సామాన్య ప్రజలకు భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. మితిమీరిన వేగంతో వాహనాలను నడుపుతూ యువకులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, వీధుల్లో బహిరంగ మద్యపానం చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు స్థానికుల నుంచి ఫిర్యాదులు అందాయన్నారు. ప్రతిరోజు రాత్రివేళల్లో పోలీసు సిబ్బంది ప్రత్యేక గస్తీలు నిర్వహించి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. డ్రోన్ టెక్నాలజీ వినియోగించి నేరాలను అదుపు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నార్త్ సబ్‌డివిజన్ డీఎస్పీ మురళీకృష్ణ, అర్బన్ సీఐ వినోద్‌కుమార్, రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు, తాడేపల్లి సీఐ కల్యాణ్‌రాజు, ఎస్‌ఐలు మహేష్, ప్రతాప్, జే.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



రత్నాలచెరువు వాసులతో మాట్లాడుతున్న ఏఎస్పీ రవికుమార్

జీఎస్టీతో వేగంగా ఆర్థికాభివృద్ధి

● సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సుజిత్‌మల్లిక్

గుంటూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): వస్తు సేవల పన్ను(జీఎస్టీ)తో దేశం వేగంగా ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నట్లు సెంట్రల్ జీఎస్టీ గుంటూరు కమిషనర్ సుజిత్ మల్లిక్ తెలిపారు. జీఎస్టీ భవన్‌లో ప్రీ జీఎస్టీ డే వేడుక గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీతో పన్ను వ్యవస్థ పూర్తిగా చక్కబడిందని, పన్నులను అంగీకరించే సమాజం ఏర్పడిందన్నారు. పన్ను చట్టాల్లో పారదర్శకత పెరగటమే కాకుండా, పన్ను అధికారులకు, పన్ను చెల్లింపుదారుల మధ్య స్నేహభావం ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో జీఎస్టీ అడిషనల్ కమిషనర్ లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ కమిషనర్లు ఎం నాగరాజు, రవికుమార్, వెంకటేశ్వరరావు, మనోజ్‌కుమార్, మరియదాసు, రాయలు, ఆనందరావు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు వక్కలగడ్డ భాస్కరరావు, యేల్చూరి వెంకటేశ్వర్లు, శాశ్విత గౌరవాధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు, నేషనల్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు చదలవాడ హరిబాబు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇండియన్ టెక్స్‌టైల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సీజీఎస్టీ కమిషనర్ సుజిత్‌మల్లిక్‌ను సత్కరిస్తున్న ఛాంబర్ ఆఫ్ కామర్స్ నాయకులు



మక్కెన మల్లికార్జునరావు

జీడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా మక్కెన

● అధికారిక ఉత్తర్వులు విడుదల చేసిన ప్రభుత్వం

8

వర్షాల ఇబ్బందులపై కాల్‌సెంటర్

జీఎంసీలో ఫిర్యాదుల కోసం 0863-2345103

గుంటూరు కార్పొరేషన్, మే 29 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వాయుగుండం నేపథ్యంలో రాబోవు మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణశాఖ హెచ్చరికలపై నగర పాలక సంస్థ అప్రమత్తమైంది. వర్షాల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా, ఫిర్యాదుల కోసం జీఎంసీలో 0863-2345103 నెంబరుతో ప్రత్యేకంగా కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ కాల్‌సెంటర్‌కు ప్రజలు ఫిర్యాదు చేస్తే సత్వరం చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. వర్షాల వల్ల తలెత్తే సమస్యలపై స్పందించడానికి 24 గం టలు పనిచేసేలా కాల్ సెంటర్‌లో ప్రత్యేకంగా సిబ్బందిని నియమిం చినట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రమంలో తమ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు, చెట్లు విరిగి ట్రాఫిక్‌కి అడ్డుగా ఉన్నా, వర్షం నీరు నిలిచినా తక్షణం కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇస్తే సత్వరం చర్యలు తీసుకుంటామ న్నారు. రోడ్లపై పడిన చెట్లను తొలగించడానికి ఉద్యాన సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు. విద్యుత్ సరఫరా అంతరాయం కలిగినా తాగునీటి సరఫరాకి సమస్య లేకుండా ముందస్తుగా జనరేటర్లు ఏర్పాటు చేసుకున్నామన్నారు. ప్రమాదకరంగా ఉన్న హోర్డింగులు, బ్యానర్లను తొలగించాలని సిటీ ప్లానర్‌ని ఆదేశించినట్లు కమిషనర్ తెలిపారు.

నాలుగు రైళ్ల పాక్షిక రద్దు

గుంటూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ బ్లాక్ కారణంగా నాలుగు రైళ్లను పాక్షికంగా రద్దు చేసినట్లు గుంటూరు డీఆర్ఎం సుధేష్ణ సేన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. (17254) ఔరంగబాద్ - గుంటూరు ఎక్స్‌ప్రెస్ ఈ నెల 31 నుంచి సెప్టెంబరు 20వ తేదీ వరకు ఔరంగబాద్ నుంచి కాకుండా జల్నా స్టేషన్ నుంచి బయలుదేరి గుంటూరుకు వస్తుంది. (17253) గుంటూరు - ఔరంగబద్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 30 నుండి సెప్టెంబరు 19 వరకు జల్నా స్టేషన్ వరకే ప్రయాణించి ఆగిపోతుంది. (17243)గుంటూరు - రాయగడ ఎక్స్‌ప్రెస్ 1న విజయనగరం వరకే ప్రయాణించి ఆగిపోతుంది. ఈ కారణంగా (17244) రాయగడ - గుంటూరు ఎక్స్‌ప్రెస్ 2న రాయగడ నుంచి కాకుండా విజయనగరం నుంచి బయలుదేరి గుంటూరుకు వస్తుంది.

మిర్చియార్డులో.. కొత్త నీరు

- వేర్వేరు ఏఎంసీల నుంచి తొమ్మిది మంది సూపర్‌వైజర్లకు పోస్టింగ్
- గుంటూరు వచ్చేందుకు ఆసక్తి చూపిన గ్రేడ్-2, 3 సెక్రటరీలు, యూడీసీలు
- పూర్తిస్థాయి సిబ్బంది లేకుండా రూ.100 కోట్ల సెస్సు వసూళ్లు సాధ్యమా!

గుంటూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): మిర్చి యార్డులో సిబ్బందిని సమూలంగా మార్చిన మార్కెటింగ్ శాఖ.. వారి స్థానంలో కొత్తవాళ్లని పోస్టింగ్ చేసేందుకు నానా తంటాలు పడుతోంది. గతంలో గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో పోస్టింగ్ అంటే ఎగురుకుంటూ వచ్చే సిబ్బంది.. ప్రస్తుతం విజిలెన్స్ కేసులు కారణంగా వెనకడుగు వేస్తున్నారు. మార్కెటింగ్ కమిషనర్ కార్యాలయంలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించగా గుంటూరు ఎవరైనా వెళతారా అని అడిగితే చాలామంది నుంచి మౌనమే సమాధానంగా వచ్చింది. కొద్దిమంది మాత్రమే ముందుకు వచ్చారు. తెనాలి, నరసరావుపేట, గన్నవరం, బాపట్ల, ప్రత్తిపాడు, ఫిరంగిపురం, నూజివీడు నుంచి సూపర్‌వైజర్లు గుంటూరు ఏఎంసీకి వచ్చేందుకు ఆసక్తి చూపించారు. దాంతో వారికి ఇట్టే పోస్టింగ్ కల్పిస్తూ ఉత్తర్వులు సిద్ధం చేశారు.

విజిలెన్స్ విచారణలతో వెనకడుగు..

గుంటూరు ఏఎంసీలో సూపర్‌వైజర్ల పాత్ర ఎంతో కీలకం. మిర్చి యార్డు, కోల్డ్‌స్టోరేజ్‌లు, పత్తి జిన్నింగ్ మిల్లుల్లో జరిగే లావాదేవీల పర్యవేక్షణ వీరి కనుసన్నల్లోనే ఉంటుంది. అయితే గత ప్రభుత్వంలో దాదాపుగా రూ.347 కోట్ల ఆదాయం మిర్చి యార్డుకు గండి పడిందని, అందుకు కారణం సూపర్‌వైజర్లు, సెక్రటరీలేనని పేర్కొంటూ విజిలెన్స్ రిపోర్టు ఇవ్వడంతో 18 మందిపై క్రమశిక్షణ చర్యలకు ప్రభుత్వం ఉపక్రమించింది. విజిలెన్స్ రిపోర్టులో ఉన్న వాళ్లందరిని సాగనంపింది. కాగా, ఇప్పుడు తెనాలి నుంచి బాజీబాబు, గౌస్‌బాషా, సుజాత, సంజీవరావు (నరసరావుపేట), కళావతి(నరసరావుపేట), నాగమణి (గన్నవరం), మోహన్‌రావు (బాపట్ల), వెంకటరత్నం (ప్రత్తిపాడు), చంద్రశేఖర్ (ఫిరంగిపురం) కు కమిషనర్ పోస్టింగ్‌లు కల్పించారు. నూజివీడులో గ్రేడ్-3 సెక్రటరీగా ఉన్న నరసింహారావు కూడా గుంటూరు వచ్చేందుకు ఆసక్తి చూపడంతో ఆయన పేరుని ప్రిన్సిపల్ సెక్రటరీకి నివేదించారు. అయితే ఇంకా 9 సూపర్‌వైజర్ పోస్టులు ఖాళీ ఉన్నాయి. వాటిల్లోకి వచ్చేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదు. ఈ పరిస్థితుల్లో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గుంటూరు మిర్చి యార్డుకు రూ. 100 కోట్లకు పైగా మార్కెట్ ఫీజు లక్ష్యాన్ని మార్కెటింగ్ శాఖ ఇదివరకే నిర్దేశించింది. పూర్తిస్థాయి సిబ్బంది లేకుండా ఏ విధంగా లక్ష్యాన్ని అధిగమిస్తారో అధికారులకే తెలియాలి.

సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీల బదిలీలు

మార్కెటింగ్ శాఖలో సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీలుగా వివిధ ఏఎంసీలలో విధులు నిర్వహిస్తున్న అధికారులకు కూడా బదిలీల కౌన్సెలింగ్ పూర్తి అయింది. చిలకలూరిపేట సెక్రటరీ యోగేశ్వరరావు ఆకివీడుకు, ఆకివీడులో ఉన్న డీసీహెచ్ సుబ్బారావు తెనాలికి, తెనాలిలో ఉన్న జేవీ సుబ్బారావుని దుగ్గిరాలకు, భీమవరం సెక్రటరీ ప్రసన్నకుమారికి పొన్నూరు, దుగ్గిరాల సెక్రటరీ ఎం.శ్రీనివాసరావుని కొవ్వూరుకు , పల్నాడు ఏడీఎం సూర్యప్రకాష్‌రెడ్డి అద్దంకి సెక్రటరీగా, ఒంగోలు ఏడీఎం ఉపేంద్ర నరసరావుపేటకు, బాపట్ల ఏడీఎం రమేష్ గుంటూరు ఏడీఎంగా పోస్టింగ్‌లు కోరుకొన్నారు. అలానే అనంతపురం ఏడీఎం సత్యన్నారాయణ చౌదరి కూడా గుంటూరు ఏడీఎంగా పోస్టింగ్ కోరుకొన్నారు. వీటన్నింటిపై ప్రిన్సిపల్ సెక్రటరీ తుది నిర్ణయం తీసుకోనున్నారు.

దీపం-2.. నగదేది?

(5వ పేజీ తరువాయి)

నగదు అందలేదు. పల్నాడు జిల్లాలో 2 లక్షల 86వేలకి 88,196 మందికి మాత్రమే ఇప్పటి వరకూ నగదు జమైంది. గుంటూరు జిల్లాలో 3 లక్షల 8వేల మందిలోలక్షా 45వేల మందికి మాత్రమే నగదు పడింది. బాపట్ల జిల్లాలో 2,20,568 మందిలో అత్యధికమందికి నగదు జ మకాలేదు. గ్యాస్ బుకింగులు పూర్తై రెండు నెలలు కావస్తున్నా దీపం- 2 పథకం నిధులు జమ కాకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

వారంలోపు జమ

గడిచిన రెండు నెలలుగా గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకున్న లబ్ధిదారులకు త్వరలోనే నగదు జమ అవుతుంది. నిధులు కూడా అందుబాటులోకి వచ్చాయి. కొన్ని సాంకేతిక కారణాల వల్లే పంపిణీ ఆగింది. ఈ వారంలో లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమవుతుంది.

-చంద్రముని, డీఎస్‌వో(ఎఫ్ఏసీ)

ఖరీఫ్‌పై కదలరా?

(5వ పేజీ తరువాయి)

అందించాలి. కానీ ఇందుకు సంబంధించిన సమాచారం ఏదీ కూడా వ్యవసాయశాఖ వద్ద అందుబాటులో లేదు. బాపట్ల జిల్లాలో 700, గుంటూరు జిల్లాలో 1400, పల్నాడులో 1500 విత్తన నమూనాలను సేకరించి పరీక్షలు జరపాల్సి ఉండగా ఇప్పటి వరకు ఇందులో 25 శాతం లక్ష్యాలను కూడా చేరుకోలేదు. మూడు జిల్లాల పరిధిలో దాదాపు 60,000 మట్టి నమూనాలు సేకరించి వాటి ఫలితాలను ఖరీఫ్ సీజన్ ఆరంభానికి ముందు రైతులకు అందించాల్సిన వ్యవసాయశాఖ ఇప్పటి వరకు ఇందులో 30 శాతం లక్ష్యాలను కూడా చేరుకోకపోవడం ఖరీఫ్ సన్నద్ధతపై సదరు శాఖ నిర్లక్ష్యానికి సూచికగా కనబడుతోంది. రాయితీ విత్తనాలకు సంబంధించి రైతు సేవా కేంద్రాల వారీగా వచ్చిన ఇండెట్లు ఎన్ని? నిల్వలు ఎంతనే దానిపై ఆయా విభాగాల వద్ద ఇప్పటికీ స్పష్టత లేదు. చివరి ఆయకట్టు వరకు సాగు నీరు సమృద్ధిగా అందాలంటే కాల్వల మరమ్మతుల పనులు పూర్తి కావడం అత్యంత కీలకం. అయితే ఆశించిన స్థాయిలో పనులు వేగం గా జరగడం లేదని రైతులు చెప్తున్నారు. సాగు పనులు ప్రారంభమైన తర్వాత కాల్వల ద్వారా నీరు రాకపోతే పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగు ణంగా పంటల సాగు చేసేలా అన్నదాతలను చైతన్య పరచాల్సిన బాధ్యత ఆయా విభాగాలదేనని ముఖ్యమంత్రి చంద్రబా బు పదేపదే చెబుతున్నారు. అయితే ఇప్పటి వరకు మూడు జిల్లాల పరిధిలో ఒక్కటంటే ఒక్క అవగాహన సదస్సు కూడా ఈ అంశంపై నిర్వహి ంచిన దాఖలాలు లేవు. ఈ పరిస్థితుల్లో రైతులు తమకు తోచిన పైరునో లేక గతేడాది ధర ఆధారంగానో ఎంచుకుంటే ఏటా నష్టపో యే పరిస్థితులు ఎదురవుతాయని పలువురు ఆందోళన చెందుతున్నారు.

గృహోపకరణాల..గిడ్డంగిలో అగ్నిప్రమాదం

పెదకాకాని, మే 29(ఆంధ్రజ్యోతి): ఆటో నగర్‌లోని ఓ ప్రైవేట్ గిడ్డం గిలో అగ్ని ప్రమా దం జరిగిందని పెదకాకాని సీఐ నారాయణ స్వామి గురు వారం తెలిపారు. ఆటో నగర్ లోని లారీ స్టాండ్ రోడ్డు సమీప ంలో గుంటూ రుకు చెందిన ప్రైవేటు వ్యాపారి ఒక గిడ్డంగిలో స్టాక్ పాయింట్ పెట్టుకున్నారు. అందులో ఫ్రిజ్‌లు, ఏసీలు, వాషింగ్ మిషన్లు ఇతర గృహోపకరణాల స్టాకు పెట్టారు. గత అర్థ రాత్రి జరిగిన ప్రమాదంలో స్టాక్ మొత్తం కాలి బూడిదైంది. వాచ్‌మెన్ వేణు తెలియజేయడంతో.. యజమానులు వచ్చి చూడగా మొత్తం కాలిపో యింది. గుంటూరు అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. పెదకాకాని పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. సుమా రు రూ.3 కోట్ల నష్టం వాటిల్లిందని అధికారులు అంచనా వేస్తున్నారు.

విద్యాకిట్లు వచ్చేశాయ్

(5వ పేజీ తరువాయి)

పాఠశాలలు ఉండగా ఒకటి నుంచి పదో తరగతి వరకు 6.70 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి ఉచితంగా విద్యా కిట్లు, పాఠ్యపుస్తకాలు పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు.

విద్యార్థులకు ఉపశమనం

ఈ విద్యా సంవత్సరం నుంచి రెండు సెమిస్టర్ల విధానం అమలు కానున్నది. పుస్తకాలు ఇచ్చే విధానంలో కూడా మార్పులు చేయనున్నారు. దీంతో విద్యార్థులకు పుస్తకాల బరువు తగ్గనున్నది. ఒకటి, రెండు తరగతులకు తెలుగు, ఆంగ్లం, గణితం కలిపి ఒక పుస్తకం, వర్క్‌బుక్ ఒకటి ఇవ్వనున్నారు. మూడు నాలుగు, ఐదు తరగతులకు తెలుగు, ఆంగ్లం కలిపి ఒక పుస్తకం, గణితం, పరిసరాల విజ్ఞానం కలిపి ఒక పుస్తకంగా ఇవ్వనున్నారు. ఆరు ఏడు తరగతులకు తెలుగు ఆంగ్లం హిందీ ఒక పుస్తకంగా, గణితం భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం, రసాయన శాస్త్రం కలిపి ఒక పుస్తకంగా, సోషల్ స్టడీస్‌లో చరిత్ర, భౌగోళిక శాస్త్రం అర్థశాస్త్రం కలిపి ఒక పుస్తకంగా అందించనున్నారు. పదో తరగతి విద్యార్థులకు కూడా సెమిస్టర్ వారీగా పుస్తకాలు ఇవ్వనున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. దీనివల్ల పుస్తకాల బరువు భారీగా తగ్గనున్నట్లు ఉపాధ్యాయులు చెప్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

వివాహిత ఆత్మహత్య కేసులో.. నిందితుడి అరెస్ట్

తెనాలి రూరల్, మే29 (ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపులు తాళ లేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన కేసులో నిందితుడిని రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ ఆనంద్ గురువారం వివరాలు వెల్లడించారు. మండలంలోని గుడివాడకు చెందిన వివా హిత అదే గ్రామంలో కోళ్ల ఫారంలో రోజువారి కూలీగా పనిచేస్తూ జీవిస్తోంది. గ్రామానికే చెందిన రౌడీషీటర్ పాలపర్తి మహేష్ ఆమెను ప్రేమిస్తున్నానంటూ వెంటబడేవాడు. తన వెంటపడవద్దని ఆ మహిళ ఎన్నిసార్లు చెప్పినా ప్రవర్తన మార్చుకోలేదు. ఆమె ఫోన్ నంబరు తీసుకుని అసభ్యంగా మాట్లాడేవాడు. అతడి ఆగడాలు త ట్టుకోలేక విషయాన్ని బాధితురాలు తను పనిచేసే చోట యజమా నికి చెప్పింది. దీంతో మహేష్‌ను పిలిపించి మందలించగా.. కొన్నిరో జుల దూరంగా ఉండి.. తర్వాత వివాహితను వెంబడించి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయాన్ని బాధితురాలు భర్తకు తెలప డంతో మహేష్ ఇంటికి వెళ్లి మందలించే ప్రయత్నం చేశాడు. దీంతో మహేష్, అతడి తల్లి ఇద్దరూ కలిసి.. వివాహితతో అక్రమ సంబం ధం ఉందని ఊరంతా ప్రచారం చేయడంతో.. ఆమె మనస్థాపానికి గురై గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఆసుపత్రిలో చికి త్స పొందుతూ గత నెల 24న మృతి చెందింది. దీనిపై కేసు నమో దు చేసి, విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడిని గుడివాడలో అదుపులోకి తీసుకుని కోర్టు ఎదుట హాజరుపరిచారు. నిందితుడికి న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ ఆనంద్ తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయ పురి సౌత్, మే 29 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువా రం నాటికి 512.50 అడుగు లు ఉంది. ఇది 135.95 టీఎంసీ లకు సమానం. కుడి కాలువ ద్వారా 5,598 క్యూ సెక్కులు, ఎస్ఎల్‌బీసీ 450 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 6,048 క్యూసె క్కుల నీరు దిగువకు చేస్తున్నారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌తో రైతులకు ప్రయోజనం



రైతులకు విత్తనాలు అందజేస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు

గుంటూరు (తూర్పు), మే 29(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో రూపొందించిన వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంతో రైతులకు మేలు జరుగుతుందని లాం, కృషి విజ్ఞాన కేంద్రం, విస్తరణ సంచాలకులు డాక్టర్ బి.శోభ అన్నారు. గురువారం గుంటూరు రూరల్ మండలం, జొన్నలగడ్డ గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఖరీఫ్ ప్రణాళికల్లో భాగంగా ప్రభుత్వాలు అందించే పథకాలు, భూసార పరీక్షలు, నూతన వంగడాల ఎంపిక, పంటల్లో సస్యరక్షణ చర్యలు, పశుపోషణలో మెళుకువలు వంటి అంశాలపై శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు సబ్సిడి విత్తనాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు, శాస్త్రవేత్తలు గంగాదేవి, రాజకుమారి, మండల వ్యవసాయ అధికారి సుబ్రహ్మణ్యం, గ్రామ మాజీ ఉపసర్పంచ్ వంగా నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జంగాల అజయ్‌కుమార్, సీపీఐ నాయకులు

హామీల అమలుకు పోరు

● సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్

గుంటూరు(తూర్పు), మే 29(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక నిరంకుశ విధానాలపై పోరాడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ పిలుపు నిచ్చారు. గురువారం స్థానిక కొత్తపేట, సీపీఐ జిల్లా కార్యాలయంలో కొల్లి రంగారెడ్డి అధ్యక్షతన జరిగిన పొన్నూరు నియోజకవర్గ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులంతా ముక్త కంఠంతో నరేంద్ర మోదీ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మికులు పోరాడాలని అన్నారు. రాష్ట్ర కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పేరుతో అధికారంలోకి వచ్చి మహిళలకు ఉచిత బస్సు, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, ఉచిత గ్యాస్, ఇళ్ల స్థలాలు ఇవ్వడంలో పూర్తిగా విఫలం చెందిందని అన్నారు. సమావేశంలో ఆరేటి రామారావు, రెంటాల కుమారి, షేక్ గౌస్ కూసం నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాకీ డబ్బులు ఇస్తానని.. వ్యక్తిపై దాడి.. దోపిడీ

గుంటూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): బాకీ డబ్బులు ఇస్తానని షాపునకు పిలిపించి, దాడి చేసి కొట్టడమే కాకుండా అతని బ్యాంక్ ఖాతాలోని నగదును ఫోన్ పే ద్వారా తన ఖాతాకు బదిలీ చేయించుకున్న ఘటనపై నగరంపాలెం పోలీస్‌స్టేషన్లో కేసు నమోదయింది. పోలీసుల కథనం మేరకు.. కొత్తపేటకు చెందిన వి క్రాంత బ్యాంకు ఉద్యోగి ఘంటసాల ఆనందరాజు తన కు పరిచయమైన మస్తాన్ దర్గా ప్రాంతానికి చెందిన కోనా శ్రీనివాస రావుకు రూ.3లక్షలు అప్పుగా ఇచ్చాడు. శ్రీనివాస రావు రూ.లక్షన్నర అప్పు తీర్చాడు. మిగిలిన బకాయి డబ్బులు ఇవ్వాలంటూ శ్రీనివాసరావును ఆనందరాజు అడుగుతున్నాడు. ఈ నెల 26న శ్రీనివాసరావు ఆనందరాజు కుమారుడు గోపీకి ఫోన్ చేసి బాకీ డబ్బులు ఇస్తానని, షాప్‌కి వచ్చి తీసుకెళ్లాలని చెప్పాడు. దీంతో గోపి మస్తాన్ దర్గా వెనుక ఉన్న శ్రీనివాసరావు హార్డ్వేర్ షాప్‌కి వచ్చాడు. అక్కడ శ్రీనివాసరావుతోపాటు మరో ముగ్గురు గోపిపై దాడిచేసి కొట్టడ మే కాకుండా ఆయన సెల్‌ఫోన్ లాక్కున్నారు. ఖాతా నుంచి రూ.4లక్షల నగదు తమ వారి ఖాతాకు బదిలీ చేయించుకున్నారు. అంతేగాక రెండు ఉంగరాలను కూడా తీసుకున్నారు. ఎవరికైనా చెబితే చంపుతామని బెదిరించారని బాధితుడు గోపీ ఫిర్యాదులో పేర్కొన్నారు. కొత్తపేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


విద్యానగర్‌లో కారు చోరీ

స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని విద్యానగర్‌కు చెందిన కారు చోరీకి గురైంది. వివరాల మేరకు.. విద్యా నగర్లోని ఎస్ఆర్ఐ అగ్రిటెక్ సీడ్స్ కార్యాలయంలో పనిచేస్తున్న కారు డ్రైవర్ బుధవారం రాత్రి కార్యాలయం వద్దే కారు పార్కింగ్ చేశారు. తాళాలు అక్కడే తగిలించి వెళ్లాడు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో చూడగా కారు కనిపించలేదు. కార్యాలయంలో పెట్టిన తాళాలు కూడా లేవు. గతంలో ఇదే కార్యాలయంలో పనిచేసిన కడప జిల్లాకు చెందిన రాంప్రసాద్ రెడ్డిపై అనుమానం ఉన్నట్లు డ్రైవర్ నాగార్జున ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీవీలు, ఏసీలు చోరీ

స్థానిక అరండల్ పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని బ్రాడీపేట మెయిన్ రోడ్డుపైగల గ్రాండ్ నాగార్జున హో టల్లో దొంగలుపడ్డారు. శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణం నేపథ్యంలో రెండు నెలల క్రితం హోటల్‌ను తాత్కాలికంగా మూసివేశారు. అయితే గడిచిన మూడు రోజులుగా హోటల్లోని గదులలో ఉన్న 14 టీవీలు, 4 ఏసీలను కూడా అపహరించారు. హోటల్ సూపర్ వైజర్ నాగార్జున ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనదారుడికి గాయాలు



ద్విచక్రవాహనం నుంచి జారి పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బుధవారం అర్ధరాత్రి ఓ వ్యక్తి ఏటుకూరు బైపాస్ రో డ్డు సెంటర్ వద్ద బైక్‌పై (ఏపీ 39 కేఎఫ్ 6151) నుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. గాయాలై గుంటూ రు ప్రభుత్వ ఆసుపత్రిలో అపస్మారక స్థితిలో ఉన్నాడు. ఆచూకీ తెలిసినవారు నల్లపాడు పోలీస్‌స్టేషన్ సీఐ 86888 31376 నంబరులో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

ఎక్కడి పనులు అక్కడే..

● వరుస వర్షాలతో బ్రేక్
● వాహనదారులకు ఇబ్బందులు





నిలిచిన జీటీ రోడ్డులో ఔట్ ఫాల్ డ్రెయిన్‌ల పనులు

గుంటూరు, మే 29(ఆంధ్రజ్యోతి): నగరంలో జరుగుతోన్న పలు అభివృద్ధి పనులు ఎక్కడివక్కడ నిలిచిపోయాయి. అల్పపీడన ద్రోణి కారణంగా వరుసగా కురుస్తోన్న వర్షాలతో లోతట్టు ప్రాంతాలను ముంచెత్తుతోన్నాయి. దాంతో పలు నిర్మాణ పనులకు బ్రేక్ పడింది. చుట్టుగుంట చెరువు పనులు, నల్లపాడు రోడ్డు, జీటీ రోడ్డు, ఏటి అగ్రహారం మెయిన్ రోడ్డు విస్తరణ పనులకు వర్షం ఆటంకంగా నిలిచింది. వరుస వర్షాలతో నిర్మాణ పనులు ఎక్కడివక్కడ నిలిపివేశారు. ప్రధానంగా ఏటి అగ్రహారం మెయిన్ రోడ్డు సగ భాగంపైనే రోడ్డు నిర్మాణ పనులు చేయటం, మధ్యలో డివైడర్ నిర్మాణ పనులను పూర్తి చేశారు. మిగతా పనులు చేస్తుండగా వర్షం అడ్డంకిగా మారింది. ఇక చుట్టుగుంట చెరువు పార్కు అభివృద్ధి పనులు కూడా ఎక్కడివక్కడ నిలిచిపోయాయి. మరో వైపు నిర్మాణ పనులకు తీసుకొచ్చిన ఇసుక, కంకర వంటి వాటిని ప్రధాన రహదారికి పక్కనే వేయటంతో వాహనాల రాకపోకలతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు.



నిలిచిపోయిన చుట్టుగుంట చెరువు అభివృద్ధి పనులు

టిడ్కో గృహ సముదాయాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు

● కమిషనర్ పులి శ్రీనివాసులు



టిడ్కో గృహాల వద్ద ప్రజలతో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, మే 29(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని టిడ్కో గృహ సముదాయాల వద్ద మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం కమిషనర్ అడవి తక్కెళ్లపాడులోని టిడ్కో గృహ సముదాయాలను జీఎంసీ, టిడ్కో ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించి, మౌలిక వసతులపై ప్రజల తెలిపిన సమస్యలను తెలుసుకొని, సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అడవితక్కెల్లపాడులోని టిడ్కో ఇళ్లల్లో షుమారు 13 వందల కుటుంబాలు నివాసం ఉంటున్నట్లు తెలిపారు. సదరు ప్రాంతంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. తక్షణం తాగునీటి సమస్య తీరేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఈని ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో కచ్చా డ్రెయిన్లు, జీఎస్బీ రోడ్ లు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. టిడ్కో గృహసముదాయాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు టిడ్కో ఇంజనీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. పర్యటనలో ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, టిడ్కో ఎస్ఈ ఉమామహేశ్వరశాస్త్రి, సిఎంఓహెచ్ డాక్టర్ అమృతం, కార్పొరేటర్ బి.స్మిత పద్మజ, జిఎంసి డిఈఈలు శ్రీనివాస్, హనీఫ్, టిడ్కో డిఈఈ సేతుబాబు, ఎస్ఎస్ సోమశేఖర్, ఏఈలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

వర్షం నీరు నిల్వ ఉండకుండా చర్యలు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వర్షం నీరు రోడ్ల మీద నిలవకుండా డ్రైన్లలోకి వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగా ప్రధాన డ్రైన్లలో పూడిక తీత పనులను వేగవంతం చేశామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. కమిషనర్ బాలాజీ నగర్, పాత గుంటూరు తదితర ప్రాంతాల్లో పూడికతీత పనులను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించి, తగు ఆదేశాలు జారీ చేశారు. త్వరలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి ఆక్రమణలను తొలగిస్తామన్నారు. ఏఈ పి.వెంకటేశ్వరరావు, టీపీఎస్ లక్ష్మణస్వామి, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

4న నగరంలో యోగాంధ్ర కార్యక్రమం..

అంతర్జాతీయ యోగా దినోత్సవం (జూన్ 21) సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన యోగాంధ్ర 2025లో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జూన్ 4న ఉదయం స్థానిక ఎన్టీఆర్ మునిసిపల్ స్టేడియం ఎదురు రోడ్డు (యోగా రోడ్)లో నగర ప్రజలు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలు, స్టేక్ హోల్డర్స్ తో కలిసి మెగా యోగా కార్యక్రమం చేపట్టనున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

మహానాడులో మన నేతలు



సీఎం చంద్రబాబుతో ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, మే 29(ఆంధ్రజ్యోతి): కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవిరెడ్డి, పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డప్పగారి శ్రీనివాసుల రెడ్డి దంపతులను గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, రామచంద్రరావు దంపతులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని గల్లా మాధవి దంపతులు దుశ్శాలువాతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఇతర టీడీపీ నేతలు రెడ్డప్పగారి దంపతులను కలిశారు.

● సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే నసీర్ శుభాకాంక్షలు

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడిగా మరోమారు ఎన్నికైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ శుభాకాంక్షలు తెలిపారు. ఆ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబు నేతృత్వంలో పార్టీ మరింత పటిష్టమవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.



మాధవిరెడ్డి దంపతులతో ఎమ్మెల్యే గల్లా మాధవి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, గల్లా రామచంద్రరావు



గోడప్రతులను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

నిరసనలను జయప్రదం చేయండి

గుంటూరు(తూర్పు), మే 29(ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో రెండు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి, నివాసాలు కట్టుకునేందుకు రూ.5 లక్షలు ఇవ్వాలనే ప్రభుత్వ హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో జూన్ 2న స్థానిక తహసీల్దారు కార్యాలయాల వద్ద జరిగే నిరసనలను జయప్రదం చేయాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి పిలుపు నిచ్చారు. స్థానిక కొత్తపేట, మల్లయ్య లింగం భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ధర్నాకు సంబంధించిన గోడ ప్రతులను ఆవిష్కరించి, మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఆమోదయోగ్యం కాని ప్రాంతాల్లో స్థలాలు ఇచ్చారని, దీంతో పేదలు ఇంటి నిర్మాణాలుకు దూరమయ్యారని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఈ హామీని నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. అర్హులైన లబ్ధిదారులు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో అకిటి అరుణ్‌కుమార్, రావుల అంజిబాబు, మంగ శ్రీనివాస్, చల్ల మరియదాసు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

● ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ తేజ

గుంటూరు, మే 29(ఆంధ్రజ్యోతి): జిల్లా లో పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎం ఈ క్లస్టర్ డెవలప్మెంట్ కార్యక్రమంలో భా గంగా పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ తేజ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా ఇండస్ట్రీయల్ అండ్ ఎక్స్‌పోర్టు ప్రమోషన్ కమిటీ(డీఐఈపీసీ) సమావేశం జరిగింది. ఈ స మావేశంలో అజెండాకు సంబంధించి చ ర్చించిన అంశాలపై కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎంఎస్ఎంఈ క్లస్టర్లు ఏర్పాటుకు అనుకూలమైన భూములను పరిశ్రమల శాఖ అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయం చేసుకుంటూ వెంటనే గుర్తించాలన్నారు. సింగిల్ డెస్క్‌లో పరిశ్రమల అనుమతుల దరఖాస్తులను సంబంధిత శాఖలు సక్రమంగా పరిశీలన చేసి పెండింగ్ లేకుండా నిర్దేశిత సమయంలో పరిష్కరించాలని స్పష్టం చేశారు. సింగిల్ డెస్క్ ద్వారా వచ్చిన 49 దరఖాస్తులకు... 34 మంజూరు చేస్తూ 14 దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచి, ఒకటి తిరస్కరించడం జరిగిందన్నారు. జిల్లాలో 18 ఎంఎస్ఎంఈ పరిశ్రమలకు పెట్టుబడి, వడ్డీ, విద్యుత్, జీఎస్టీ, క్వాలిటీ సర్టిఫికేషన్ రాయితీలు, క్లీనర్ ప్రొడక్షన్‌కు సంబంధించి రూ.55,68,680 మంజూరు చేస్తూ సమావేశంలో ఇన్‌చార్జి కలెక్టర్ ఆమోదించారు. అదే వి ధంగా 36 సబ్సిడీ క్లెయిమ్‌లను వివిధ కారణాలతో తిరస్కరించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మే నేజర్ ఎ.జయలక్ష్మి, లీడ్ బ్యాంకు మేనేజరు మహిపాల్ రెడ్డి, జిల్లా భూగర్భజలవనరుల శాఖ డిప్యూటీ డైరక్టర్ వందనం, కమర్షియల్ టాక్స్ డిప్యూటీ కమిషనర్ బీహెచ్ మనోరమ, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కె.రాంబాబు, కార్మిక శాఖ సహాయక కమిషనరు కృష్ణవేణి, బీఎంఏపీఎస్ఎఫ్సీ కే అనిత, జెడ్ఎం ఏపీఐఐసీ డాక్టర్ ఎంఎల్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

1న ఉచిత మోడల్ లా సెట్


గుంటూరు(తూర్పు), మే 29(ఆంధ్రజ్యోతి): ఏపీ బీసీ అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూన్ 1న నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి ఉచిత మోడల్ లాసెట్ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డైరక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఎండీ బర్కత్ అలీ అన్నారు. స్థానిక నగరంపాలెంలో ఆయన కార్యాలయంలో పరీక్షకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వరుసన తొమ్మిదవసారి ఈ పరీక్ష నిర్వహిస్తున్న అసోసియేషన్ సభ్యులను అభినందించారు. బార్ అసోసియేషన్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శి జీ శేషగిరిరావు మాట్లాడుతూ స్థానిక శ్యామలనగర్, మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఈ పరీక్షను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 829 7483785 నంబరులో సంప్రదించాలన్నారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పల్లపు కృష్ణ, బి. కోటేశ్వరరావు, బార్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి శ్రీనివాస రావు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎండీ బర్కత్ అలీ, అసోసియేషన్ సభ్యులు

జొమాటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గుంటూరు(తూర్పు), మే 29(ఆంధ్రజ్యోతి): జొమాటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని గిగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకుడు సోగా బ్రహ్మయ్య డిమాండ్ చేశారు. కార్మికులపై ఇచ్చిన తప్పుడు పోలీసు ఫిర్యాదులను వెనక్కి తీసుకుని, బ్లాక్ చేసిన జొమాటో ఐడీలను తిరిగి పునరుద్ధరించాలని కోరుతూ స్థానిక శంకర్‌విలాస్ సెంటర్లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కంపెనీ ప్రతినిధులతో గత సంవత్సర కాలంగా విన్నవిస్తున్నప్పటికి సమస్యలు పరిష్కారం చేయలేదని, గత్యంతరం లేక గురువారం పనులు నిలుపుదల చేశామని అన్నారు. ఆర్డర్ల లక్ష్యం 22 నుంచి 18 కి తగ్గించాలని కోరారు. నిరసనల్లో యూనియన్ గౌరవ అధ్యక్షుడు ముత్యాలరావు, దండా లక్ష్మీనారాయణ, బి.లక్ష్మణరావు, కె. శ్రీనివాసరావు, రణధీర్ తదితరులు పాల్గొన్నారు.



శంకర్‌విలాస్ సెంటర్‌లో నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న జొమాటో కార్మికులు

పల్లె పుష్కరిణి పనులను వేగవంతం చేయాలి

● ఉపాధి పథకం డైరక్టర్ వైవీ షణ్ముఖ్ కుమార్



మంచినీటి చెరువును పరిశీలిస్తున్న ఉపాధి పథకం డైరెక్టర్ వైవీ షణ్ముఖ్ కుమార్

గుంటూరు(తూర్పు), మే 29(ఆంధ్రజ్యోతి): పల్లె పుష్కరిణిలో భాగంగా ఎంపిక చేసిన చెరువులు, కోనేర్లు, మేట బావుల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులకు ఉపాధి పథకం స్టేట్ డైరక్టర్ వైవీ షణ్ముఖ్ కుమార్ ఆదేశించారు. పల్లె పుష్కరిణి కార్యక్రమంలో భాగంగా గుంటూరు రూరల్ మండలం, లాలుపురంలోని మంచి నీటి చెరువును పథకం అడిషనల్ కమీషనర్ ఎం.శివప్రసాదుతో కలిసి ఆయన పరిశీలించారు. నూతనంగా ఏర్పాటు చేస్తున్న వాకింగ్ ట్రాక్, జరుగుతున్న అభివృద్ధి పనులను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. షణ్ముఖ్ కుమార్ మాట్లాడుతూ చెరువులను ఉద్యానవనాలుగా తీర్చిదిద్దాలని చెప్పారు. పనుల్లో నాణ్యతను పాటిస్తూ, జూన్ మాసాంతంలోపు పనులను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ శంకర్, రూరల్ ఎంపీడీఓ బండి శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి సుభాని తదితరులు పాల్గొన్నారు.

బోగస్ రుణాల్లో దోషులను తేల్చాలి

● ఉద్యోగులపై వేధింపులు మానుకోవాలి
● జేసీకి అసోసియేషన్ నాయకుల విజ్ఞప్తి

గుంటూరు, మే 29(ఆంధ్రజ్యోతి): నకిలీ పాస్ పుస్తకాలు, రెవెన్యూ రికార్డులు సృష్టించి బోగస్ రుణాలు పొందిన అసలు దోషులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజకు విజ్ఞప్తి చేశారు. కలెక్టరేట్‌లో గురువారం అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీఎస్ రవికుమార్, సుబ్బారావు ఇతర జిల్లా అసోసియేషన్ నాయకులు కలెక్టర్‌ను కలుసుకున్నారు. నాలుగు సొసైటీలపై బోగస్ రుణాల వ్యవహారంలో ఎటువంటి సంబంధం లేని ఉద్యోగులను బాధ్యులను చేస్తూ వేధింపులకు గురిచేయడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. రుణాలు పొందిన అక్రమార్కులను గుర్తించి, రికవరీ చేయాలని కోరారు. విచారణలో ఆధారాలుంటే ఎటువంటి చర్యలకైనా తాము సిద్ధంగా ఉన్నామన్నారు. అక్రమార్కులను రాబట్టేందుకు నిష్పక్షపాతంగా విచారణ జరపాలని కోరారు. దీనిపై ఇన్‌చార్జి కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు అసోసియేషన్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉద్యోగులున్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు ఆయుధ శిక్షణ



శిక్షణలో ఎన్‌సీసీ విద్యార్థులు

గుంటూరు (విద్య) మే 29 (ఆంధ్రజ్యోతి): సమాజానికి సేవ చేసే అవకాశం యువతకు ఎన్‌సీసీ ద్వారా వస్తుందని లెఫ్టినెంట్ కల్నల్ ఎస్.వి.ఎస్. సుదర్శన్ పేర్కొన్నారు. చౌడవరం లోని ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో 10 ఆంధ్ర బాలికల బెటాలియన్ ఆధ్వర్యంలో మూడు రోజుల నుండి జరుగుతున్న కంబైన్డ్ అన్యువల్ ట్రైనింగ్ క్యాంప్ -1 శిక్షణ తరగతులలో భాగంగా గురువారం ఆయుధ శిక్షణ ఇచ్చారు. కల్నల్ సుదర్శన్ మాట్లాడుతూ ఈ శిక్షణలో విద్యార్థులు భద్రత నియమావళి, ఆయుధాల ఉపయోగ విధానాలు, లక్ష్య సాధన నైపుణ్యం, ఆధునిక కాలంలో ఆయుధాల ప్రాధాన్యం వంటి అంశాలను నేర్చుకుంటారని తెలిపారు. ప్రత్యేక అతిథిగా లీగల్ అడ్వైజర్ అనురాధ, కళాశాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ రాయపాటి గోపాలకృష్ణ ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ మేజర్ అవినాశి పట్వాల్, క్యాంపు సీనియర్ జేసీఓ ఇమాం సాహెబ్, క్యాంపు ట్రైనింగ్ జేసీఓ ఆర్ఎస్ రాజు, క్యాంపు సూపరింటెండెంట్ కొల్లా రాజశేఖర బాబు, కళాశాల ఎన్‌సీసీ అధికారులు డాక్టర్ తారాచంద్, డాక్టర్ ఉషా క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడులను అరికట్టాలి

● మాజీ ఎంపీ హర్షకుమార్



మాట్లాడుతున్న హర్షకుమార్, పాల్గొన్న దళిత సంఘ నాయకులు

గుంటూరు(తూర్పు), మే 29(ఆంధ్రజ్యోతి): దేశంలోనూ, రాష్ట్రంలోనూ దళిత, క్రైస్తవులపై దాడులు అధికమయ్యాయని మాజీ ఎంపీ హర్షకుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం, స్థానిక లాడ్జి కూడలిలోని ఎల్ఈఎం స్కూల్ ప్రాంగణంలో జరిగిన పాస్టర్ ప్రవీణ్ పగడాల సంస్మరణ సభలో సీఐడీ మాజీ చీఫ్ సునీల్‌కుమార్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. క్రైస్తవులపై జరుగు తున్న దాడులపై రాజమండ్రిలో జూన్ 4న ప్రత్యేక సమావేశం, 24 చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నట్లు తెలిపారు. క్రైస్తవ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లెల రాజు వివిధ సం ఘాల నాయకులు, పాస్టర్లు పాల్గొన్నారు.




సభలో అమ్మాయిల ఉత్సాహం


మహానాడు వేదిక


సభకు వచ్చిన వారిని తనిఖీ చేస్తున్న పోలీసులు









మహా జాతర

కడపలో మూడురోజుల పాటు నిర్వహించిన టీడీపీ మహానాడు జనజాతరను తలపించింది. మొదటి రెండు రోజులు వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో సందడిగా మారితే.. చివరి రోజు బహిరంగ సభ నభూతో నభవిష్యత్ అన్న విధంగా జరిగింది. టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు విశేషంగా తరలిరావడంతో ఇసుక వేసినా రాలదన్నట్లుగా జరిగింది. లక్షలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో మహానాడు ప్రాంగణం కిటకిటలాడింది. పెద్ద పెద్ద కటౌట్‌లు, బిగ్‌స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. అభిమాన నాయకులు వేదికపైకి రాగానే ఉత్సాహంతో కేకలు వేశారు. సెల్‌ఫోన్లలో రికార్డు చేశారు. మహిళలు, అమ్మాయిలు ఉత్సాహంగా పాల్గొని టీడీపీకి జైకొట్టారు. వేదికపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ బహిరంగసభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కడప జిల్లాపై వరాల జల్లు కురిపించారు. సభ సక్సెస్ కావడంతో జిల్లా నాయకులను సీఎం ప్రత్యేకంగా అభినందించారు.

- కడప ఆంధ్రజ్యోతి బృందం









జీడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా మక్కెన

● అధికారిక ఉత్తర్వులు విడుదల చేసిన ప్రభుత్వం

గుంటూరు, మే 29(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (జీడీసీసీబీ) చైర్మన్‌గా, వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ గురువారం అధి కారిక ఉత్తర్వులు విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం సహకార బ్యాంకు చైర్మన్‌లను గురువారం ప్రకటించింది. గత ప్రభుత్వంలో చైర్మ న్‌గా వ్యవహరించిన రాతంశెట్టి సీతా రామాంజనేయులు కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన తొలి నాళ్ళలోనే తన పదవికి రాజీనామా చేసి తప్పుకున్నారు. నాటి నుంచి డీసీ సీబీ చైర్మన్ పదవి ఖాళీగానే ఉంది. నామి నేటెడ్ చైర్మన్, పాలకవర్గ సభ్యు లు లేకపోవడంతో కొందరు అధి కారులదే పెత్తనం అయిపోయింది. దీం తో బ్యాంకులోని డిపాజిట్‌దారులు, సహకార సంఘాలు సభ్యులు తమ సమస్యలు చెప్పుకోవడానికి అవకాశం లేకుండా పోయింది. మరోవైపు జీడీసీ సీ బ్యాంకులో వైసీపీ హయాంలో జరిగిన అనేక కుంభకోణాలు వెలుగు లోకి వచ్చాయి. కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వ చేసిన మిర్చి టిక్కీలకు రుణాల మం జూరులో పెద్ద గోల్‌మాల్ జరిగింది. వీటిపై విచారణలు కొనసాగు తున్నాయి. అయితే ఇప్పటివరకు ఎవరి పైనా చర్య తీసుకోలేదు. మరో వైపు ఉద్యోగులపై కేసులకు సిద్ధమవ్వతుండటంతో వారంతా ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించటం చూడా చర్చనీయాంశంగా మారింది.

ఈ నేపథ్యంలో ప్రభుత్వం పాలకవర్గాలను నియమించింది. కాగా మంచి ముహూ ర్తం చూసుకొని జూన్ మొదటి వారం లో ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వ హించనున్నట్లు చైర్మన్ వర్గీయులు తెలిపారు.

విత్తులో విపత్తు పసిగట్టాలి

తొలకరి వర్షాల పలకరింపు.. - ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధం.. నాణ్యమైన విత్తన ఎంపికే.. శ్రీరామరక్ష

సత్తెనపల్లి, మే 29(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ముందస్తుగానే నైరుతి రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకుతున్నాయి. దీంతో సకాలంలో తొలకరి వర్షాలు కురుస్తుండటంతో అన్నదాతలు ఖరీఫ్ సాగుకు సన్నద్ధ మవుతున్నారు. దీంతో సరైన విత్తనాన్ని ఎంచుకున్న ట్లయితే అధిక దిగుబడులు సాధించవచ్చని, ఈ విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసా య శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. గతంలో అనేక సందర్భాల్లో రైతులు నకిలీ, నాసిరకం విత్తనా లను సాగు చేసి నష్టాలను చవిచూశారు. విజిలెన్స్ వ్యవసాయ శాఖ అధికారులు ఏటా తనిఖీలు నిర్వహి స్తున్నా.. మార్కెట్‌లో నకిలీ విత్తనాల జోరు తగ్గడం లేదు. ఈ పరిస్థితుల్లో అన్నదాతలే విత్తన ఎంపికలో ఆచితూచి వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

ఈ జాగ్రత్తలు తీసుకోండి

ప్రభుత్వ అనుమతులు ఉన్న దుకాణాల్లోనే విత్తనాలను కొనుగోలు చేయాలి. విత్తన ప్యాకెట్‌పై తయారీ, పరీక్షించిన, గడువు తేదీలు సరిగా ఉన్నాయో లేవో సరి చూసుకోవాలి. విత్తనాల సంచులు చిరిగినా, రంధ్రాలు ఉన్నా.. అలాగే తడిచిన విత్తనాలను కొనుగోలు చేయకపోవడం మంచిది. విత్తన ప్యాకెట్లు నిల్వ ఉంచినప్పుడు తేమ శాతం కూడా చూసుకోవాలి.

వలలో చిక్కుకోవద్దు

గ్రామాల్లో తిరుగుతూ విత్తనాలు అమ్మేవారితో



రైతులు అప్రమత్తంగా ఉండాలి. కొన్ని నకిలీ కంపెనీలకు చెందిన విత్తనాలను.. బ్రాండెడ్ అంటూ ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో తప్పుడు ప్రచారం చేస్తుంటారు. ఆయా గ్రామాల్లోని పెద్ద మనుషులను సంప్రదించి.. రైతులందరూ విత్తనాలు కొనుగోలు చేసేలా ఒత్తిళ్లు చేస్తుంటారు. తక్కువ ధరకే ఇస్తామంటూ.. కొందరు లూజుగా విత్తన విక్రయాలు జరుపుతుంటారు. ధర తక్కువ అని ఆశ పడితే చివరికి నష్టాలు తప్పవు. ఇలాంటి వ్యక్తుల గురించి వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలి.

నిషేధిత విత్తనాలకు దూరంగా ఉండాలి

బీటీ -3 రకం పత్తి విత్తనాలు కొనుగోలు చేయకూడదు. వీటి సాగు పర్యావరణానికి పెను ముప్పు అని కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. ఈ రకం పత్తి విత్తనాలు కొన వద్దని వ్యవసాయ శాఖ అధికారులు సూచించినప్పటికీ కొంత మంది వ్యాపారులు గ్రామాల్లో గుట్టుగా విక్రయిస్తున్నారు. అధిక దిగుబడులు వస్తాయన్న ఆశతో రైతులు అక్కడక్కడా రహస్యంగా ఈ విత్తనాలను సాగుచేస్తున్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

- శ్రీధర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఏడీఏ, సత్తెనపల్లి

ఖరీఫ్ సాగుకు విత్తన కొనుగోలులో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలి. కొనుగోలు రసీదును తప్పనిసరిగా తీసుకుని, విత్తన నమూనా, ప్యాకెట్‌ను భద్ర పరుచుకోవాలి. నాసిరకం, నకిలీ కంపెనీల విత్తనాలు అమ్మే వ్యక్తులను గుర్తించి వ్యవసాయశాఖ అధికారులకు సమాచారం ఇస్తే.. చట్ట పరంగా చర్యలు తీసుకుంటాం. నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి.. మోస పోతే.. పంట పూత దశలోనే అధికారుల దృష్టికి తీసుకురావాలి. శాస్త్రవేత్తల సూచనలతో నష్ట నివారణకు చర్యలు తీసుకుంటాం.

యోగాంధ్ర రిజిస్ట్రేషన్లకు పాట్లు

● ప్రతి సచివాలయానికి 50 శాతం ప్రజల టార్గెట్
● లక్ష్యం అధిగమించేందుకు ఇళ్లకు వెళ్లి మమ అనిపిస్తున్న సెక్రటరీలు

గుంటూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్రలో పాల్గొనేందుకు ప్రభుత్వం కేటాయించిన లక్ష్యాలను అధిగ మించేందుకు గ్రామ/వార్డు సచివాలయాల కార్యదర్శులు పడరాని పాట్లు పడుతున్నారు. గత వారం నుంచి ఉన్న తాధికారుల ఒత్తిళ్లు పెరిగిపోవడంతో అన్ని పనులను పక్కన పడేసి వారి పరిధిలో ఇంటింటికి వెళ్లి అందరిని యాప్‌లో నమోదు చేస్తున్నారు. మీరు యోగా నిత్యం చేస్తారా... ఎక్కడ యోగాసనాలు నేర్చుకొంటా రు... జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున ఎక్కడ పాల్గొంటారు.. వంటి అనేక ప్రశ్నలు వేసి చివరికి ఫోన్ నంబరుకు ఓటీపీ పంపించి దానిని నమోదు చేసి రిజిస్ట్రే షన్ ప్రక్రియ పూర్తి చేస్తున్నారు. సచివాలయం పరిధిలో 3 వేల మంది నివసిస్తుంటే 1,500 మందిని కనీసం రిజిస్ట్రేషన్ చేయాలన్న అధికారుల ఆదేశాల మేరకు సెక్రటరీలు ప్రస్తుతం ఈ పనిలో నిమగ్నమయ్యారు.

యోగాపై అవగాహన తక్కువ..

అంతర్జాతీయ యోగా దినోత్సవం వచ్చే నెల 21న విశాఖపట్టణంలో జరగనుంది. ఈ కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హాజరుకానున్నారు. ఈ నేపథ్యం లో యోగాపై అవగాహన కార్యక్రమాలు ఇప్ప టికే జిల్లా వ్యాప్తంగా జరుగుతున్నాయి. యోగాపై అవ గాహన పెంచేందుకు వివిధ రకాల పోటీలు నిర్వహించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. అయితే యోగా నిత్యం ఆచరించే వారి సంఖ్య తక్కువగా ఉంది.

అన్ని పనులు పక్కకు..

కాగా, ఇప్పుడు సచివాలయాల కార్యదర్శులు కేవలం తమకు ఇచ్చిన టార్గెట్‌లను పూర్తి చేసేందుకు ప్రతీ ఒక్క రిని యోగా దినోత్సవం కోసం రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. ప్రజల వద్దకు వెళ్లి అసలు విషయం చెప్పకుండా సర్వే అని చెబుతూ వాళ్లంతటికి వాళ్లే యాప్‌లో ఖాళీలు నింపేసి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేస్తున్నారు. రాష్ట్రం మొత్తం మీద యోగాంధ్ర-2025లో 2 కోట్ల మంది పాల్గొనేలా చేయాలని టార్గెట్ కావడంతో ఆ దిశగా రిజిస్ట్రేషన్లను పూర్తి చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామ/వార్డు సచివాలయాల్లో రేషన్‌కార్డు సర్వీసుల కోసం దరఖాస్తులు పెద్ద సంఖ్యలో వస్తుండగా వాటిని పక్కన పెట్టేశారు. ఎవరైనా సచివాలయానికి వెళితే ముందు యోగాంధ్రలో రిజిస్ట్రేషన్ చేయించుకోండని మెలిక పెడుతున్నారు.

జూలై 5న జాతీయ లోక్ అదాలత్

జిల్లా జడ్జి బీ సాయికళ్యాణ చక్రవర్తి

గుంటూరు(లీగల్), మే 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్ట్ ప్రాంగణాల్లో జూలై 5 న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కక్షిదా రులు తమ తమ వివాదాలను రాజీమార్గంలో పరిష్కరించుకొని లబ్ధి పొందాలని జిల్లా జడ్జీ బీ సాయికళ్యాణ చక్రవర్తి తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్ లో సివిల్ కేసులు (పార్టిషన్ దావాలు, ప్రోనోటు దావాలు, పర్మనెంట్ ఇంజెక్షన్ దావాలు, అగ్రిమెంట్ లకు



సంబంధించిన స్పెసిఫిక్ పెర్ఫార్మన్స్ దావాలతోపాటు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో వారు ఇచ్చిన సర్క్యులర్ ప్రకారం కొన్ని రాజీ పడదగ్గ ఎక్సైజ్ కేసులు, మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు, చెక్ బౌన్స్ కేసులు, భూ సేకరణకు సంబంధించిన నష్టపరిహారం కేసులు, ప్రీ-లిటిగే షన్ కేసులు పరిష్కరించటం జరుగుతుందని, తెలిపారు. కక్షిదారులు, పోలీస్ వారు, బ్యాంక్, ఇన్సూరెన్స్ కంపెనీల అధికా రులు, న్యాయవాదులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ఈ జాతీయ లోక్ అదా లత్ నందు ఎక్కువ కేసులు రాజీ మార్గం లో పరిష్కారానికి సహకరించాలని కోరారు.


సమీక్షలో పాల్గొన్న ఇన్‌చార్జ్ కలెక్టర్ భార్గవ తేజ

ఎన్‌హెచ్-544డీ జేఎం సర్వే చేపట్టాలి

గుంటూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి ఎన్‌హెచ్-544డీకి సంబంధించి గుంటూరు జిల్లాలో జాయింట్ మెజర్‌మెంట్ సర్వేని వెంటనే ప్రారంభించాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ భార్గవ తేజ ఆదేశించారు. వినుకొండ నుంచి గుంటూరు వరకు నాలుగు లైన్ల రహదారి కొనసాగింపులో భాగంగా దీనిని జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ విస్తరించబోతున్నదన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఈ రహదారి అంశంపై ఆయన ఎన్‌హెచ్‌ఏఐ, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారి ఎన్‌హెచ్-544డి గుంటూరు వరకు నాలుగు లైన్ల రహదారిగా కొనసాగింపునకు సంబంధించి 18 కిలోమీటర్లు జిల్లా పరిధిలోని మేడికొండూరు, ఫిరంగిపురం మండలాలలో ఉందన్నారు. రహదారి విస్తరణ సంబంధించి ఇప్పటికే భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందని, దీనిపై వచ్చిన రెండు అభ్యంతరాలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. భూసేకరణ పరిధిలో ఉన్న విద్యుత్ స్తంభాలు పక్కకు తరలించడానికి విద్యుత్ శాఖ అధికారులు, పైపులైన్లు, కాలువలకు సంబంధించి ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో అంచనాలు తయారు చేయించాలన్నారు. అదేవిధంగా రహదారి విస్తరణ వల్ల నిర్మాణాలు కోల్పోతున్న వారికి అందించాల్సిన నష్టపరిహారం పైన ఆర్‌అండ్‌బీ అధికారులతో అంచనాలను సిద్ధం చేయించాలన్నారు. రెవెన్యూ అధికారులు సంబంధిత శాఖల అధికారులను సమన్వయం చేసుకొని జాయింట్ మెజర్మెంట్ సర్వే ద్వారా సోమవారం నుంచి ఎస్టిమేషన్ సిద్ధం చేసే పనులను ప్రారంభించి, నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో గుంటూరు జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజావలి, జాతీయ రహదారుల పీడీ పార్వతీశం, ఆర్డీవో కే శ్రీనివాస రావు, ఫిరంగిపురం, మేడికొండూరు తహశీల్దార్లు ప్రసాద రావు, హరిబాబు, కలక్టరేట్ జి సెక్షన్ సూపరింటెండెంట్ శిరీష పాల్గొన్నారు.

రాజధాని నిర్మాణంలో భద్రత కట్టుదిట్టం

● సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్

విజయవాడ, మే 29 (ఆంధ్రజ్యోతి): కార్మికుల భద్రతకు సంబంధించి నిర్దే శించిన నిబంధనలన్నీ రాజధానిలో నిర్మాణ పనులు చేపట్టిన గుత్తేదారు సంస్థలు పాటించాలని సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ సూచించారు. రాజధాని ప్రాంతంలో శాంతిభద్రతల పర్యవేక్షించే విషయం గురించి విజయవాడలోని ఏపీ సీఆర్‌డీఏ కార్యాలయంలో గుత్తే దారు సంస్థల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజధాని నిర్మాణపనుల్లో బాలకార్మికులు, లింగవివక్షకు తావులేదన్నారు. శాంతిభద్రతల పర్యవేక్షణ, కార్మికుల భద్రతకు సంబంధిం చిన అంశాలలో పోలీస్, అగ్నిమాపక శాఖ అధికారులతో సమన్వయం చేసు కుంటూ సీఆర్డీఏ, ఏడీసీఎల్ అధికారులు, మే నేజ్మెంట్ కన్సల్టెన్సీ, సిబ్బంది పనిచేయాలని ఆదేశించారు. ప్రతినెలా అమరావతిలోని అన్ని సైట్లలో క్రైమ్ మిటిగేషన్, ఫైర్‌సేఫ్టీపై పోలీస్, ఫైర్ డి పార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో అవగాహన, శిక్షణ నిర్వహిస్తామన్నారు. రాజధా ని పనుల్లో పాలుపంచుకుంటున్న కార్మి కుల వివరాలు, వినియోగిస్తు న్న ట్రక్కులు, జేసీబీలు తదితర యంత్రాల వివరాలను నమోదు చేసుకుం టూ పోలీస్, ఫైర్ డిపార్ట్‌మెంట్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లా ఎస్పీ ఎస్.సతీశ్‌తో పాటు ఇతర అధికారులు స మావేశంలో చేసిన సూచనలు, అంశాలను ప్రణాళికాబ ద్ధంగా అమలుచేస్తామన్నారు. సీఆర్డీఏ చీఫ్ ఇంజినీర్లు డి.శ్రీరామచంద్ర మూర్తి, ధనుంజయ, ఎన్.శ్రీనివాసులు, సీఆర్డీఏ, ఏడీసీఎల్‌లోని వివిధ విభా గాల అధికారులు, మంగళగిరి డీఎస్పీ మురళీకృష్ణ, తుళ్లూరు పీఎస్ ఎస్‌డీ పీవో మురళీకృష్ణ, సీఐ శ్రీనివాసరావు, ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, మే 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో గురువారం జరిగిన వేలంలో 360 బస్తాల పసుపు విక్రయాలు జరిగాయి. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.9,600 గరిష్ఠధర రూ.10,375 మోడల్ ధర రూ.10,050పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.9,600, గరిష్ఠ ధర రూ.10,475 మోడల్‌ధర రూ.10,050 పలికాయి.

ఉరివేసుకొని వివాహిత మృతి

● న్యాయం చేయాలంటూ కుటుంబసభ్యుల రాస్తారోకో

తాడికొండ, మే 29(ఆంధ్రజ్యోతి): వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై తాడికొండ పోలీసులు బుధవారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిడుముక్కల గ్రామానికి చెందిన సునీల్ అమరావతి మండలం ఎండ్రాయి గ్రామానికి చెందిన పావని మూడు సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. తరువాత అదనపు కట్నం కోసం పావనిని సునీల్, అతని తల్లి గీత వేధించారు. దీంతో భార్యాభర్తల మధ్య గొడవ జరుగుతుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 24వ తేదీన పావని ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కి తరలించారు. విషయం తెలుసుకున్న పావని తల్లిదండ్రులు హాస్పిటల్‌కు వెళ్లి చూడగా ఆమె గొంతుపై దెబ్బలున్నట్టుగా గుర్తించారు. చికిత్స పొందుతూ పావని బుధవారం రాత్రి చనిపోయింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు గురువారం అందించారు. అయితే తమ కుమార్తెకు న్యాయం చేయాలంటూ కుటుంబసభ్యులు, బంధువులు నిడుముక్కల గ్రామంలో రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రోడ్డుపై నుంచి వెళ్లి పోవాలని ఆదేశించారు. పావని చావుకు కారణమైన సునీల్‌ని వదిలిపెట్టే ప్రసక్తి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతదేహానికి సునీల్ దహన సంస్కాలు చేయాలని బంధువులు పట్టుబట్టారు. అప్పటికే పోలీసులు సునీల్‌ను అతని తల్లి గీతను అదుపులోకి తీసుకొని తాడికొండ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దహన సంస్కారాలు భర్తతో చేయించటం వీలు కాదని పోలీసులు తెలిపారు. కుటుంబసభ్యులు, బంధువులు పోలీసులపై ఒత్తిడి తేవటంతో దహన సంస్కార కార్యక్రమానికి సునీల్‌ను తీసుకొచ్చారు. దీంతో రాస్తారోకో విరమించి వెళ్లిపోయారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు, సునీల్‌ను అతడి తల్లిని కోర్టులో హాజరు పరుస్తామని పోలీసులు తెలిపారు.

పిడుగుపాటుతో గొర్రెల కాపరి మృతి

తాడికొండ, మే 29(ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుతో గొర్రెల కాపరి మృతి చెందిన ఘటన బండారుపల్లిలో గురువారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పల్నాడు జిల్లా మాచర్ల మండలం కొప్పునూరు గ్రామానికి చెందిన రేఖ రామాంజి (42) గొర్రెల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు, కొంతకాలంగా బండారుపల్లి శివారు పొలాల్లో గొర్రెలను మేపుతున్నాడు, గురువారం గొర్రెలు మేపుతుండగా వర్షం కురవటంతో పక్కనేఉన్న చెట్టుకిందకు వెళ్లి నిలబడ్డాడు. చెట్టుపై పిడుగుపడటంతో రామాంజి అక్కడిక్కడే మరణించినట్టు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

గేదె మృతి

తాడేపల్లి (ప్రాతూరు), మే 29 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని ప్రాతూరు గ్రామంలో పిడుగుపాటుకు గురువారం ఓ గేదె మృతి చెందింది. రోజు లాగానే కృష్ణానది పాయల వద్ద మేతకు తోలుకెళ్లినట్టు రైతు మోటే పల్లి పృథ్వీ తెలిపారు. మధ్యాహ్నం అకస్మాత్తుగా వచ్చిన ఉరుములు, మెరుపులకు పిడుగుపడి గేదె మృతి చెందిందని పాడిగేదె విలువ రూ.లక్ష చేస్తుం దని పృథ్వీ తెలిపారు. జరిగిన ఘటనపై రెవెన్యూ అధికారులకు, పశు వైద్యాధికారులకు సమాచారం ఇచ్చినట్టు తెలిపారు. కాగా పశువైద్యాధికారులు వచ్చి వివరాలు నమోదు చేసుకున్నారు.

ఘనంగా వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక వేడుకలు



ప్రత్యేక అలంకరణలో రుక్మిణీసత్యభామ సమేత వేణుగోపాలస్వామి

పెదనందిపాడు, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని అన్నవరంలోని రుక్మిణీ సత్యభామసమేత వేణుగోలపాల స్వామి దేవస్థాన వార్షిక వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. వేణుగోపాలస్వామి వారి శాంతి కల్యాణ మహోత్సవం కన్నులపండువగా జరిగింది. అర్చకులు స్వామికి విశేష పూజలు చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

పొగాకు రైతులను ఆదుకోవాలి

ఫిరంగిపురం, మే 29 (ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మండల పొగాకు రైతులు ప్రభుత్వాన్ని కోరారు. ఫిరంగిపురం మార్కెట్ యార్డులో వెయ్యి క్వింటాళ్ల పొగాకును రెండు నెలల క్రితం అమ్మకానికి ఉంచామని, ఇప్పటివరకు పొగాకు కంపెనీల వారు కొనుగోలు చేయలేదన్నారు. ఎకరానికి రూ.80వేలు పెట్టుబడి పెట్టామని, అమ్మినా, అసలు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పొగాకు కొనుగోళు జరిగేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఎట్టకేలకు గొట్టిపాడు రోడ్డుకు మోక్షం

● పెమ్మసాని, బూర్ల కృషితో పనులు ప్రారంభం
● హర్షం వ్యక్తం చేస్తున్న గొట్టిపాడు వాసులు
● ఉన్నవ వరకు రూ.10 కోట్లతో పనులు



ప్రత్తిపాడు నుంచి గొట్టిపాడు రోడ్డుకు ప్రారంభమైన పనులు

ప్రత్తిపాడు, మే 29 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు నుంచి గొట్టిపాడు మీదగా జాతీయ రహదారిని కలిపే ప్రధాన రోడ్డుతో ఈ ప్రాంత వాసుల కష్టాలు తీరనున్నాయి. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు కృషితో మధ్యలోనే ఆగిన రోడ్డు పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయని కారణంగా మధ్యలోనే మూటముల్లె సర్దుకుపోయిన కాంట్రాక్టర్ తిరిగి కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో పెమ్మసాని, బూర్ల ఇచ్చిన భరోసాతో తిరిగి పనులను మొదలుపెట్టాడు. త్వరలోనే తమ కష్టాలు తీరనున్నాయంటూ గొట్టిపాడు వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్తిపాడు నుంచి గొట్టిపాడు, ఉన్నవ మీదగా బోయపాలెం వద్ద జాతీయ రహదారిని కలిపే ప్రధాన రహదారి పూర్తిగా పాడైపోయింది. పెద్ద గుంతలతో వాహనాలు ముందుకు కదలని పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే గత ప్రభుత్వం గుంతలను పూడ్చి వాహనాలు నడవడానికి వీలుగా కూడా నిధులు మంజూరు చేయలేకపోయింది. అయితే ఈ ప్రాంత ప్రజల నుంచి గట్టిగా ఒత్తిడి రావడంతో అప్పటి ఎమ్మెల్యే మేకతోటి సుచరిత సింగిల్ రోడ్డుగా ఉన్న ఈ రహదారిని డబుల్ రోడ్డుగా మార్చడంతో పాటు అనాధిగా ఇబ్బందికరంగా ఉన్న లోలెవల్ చప్టాలను బ్రిడ్జిలుగా మార్చి, ప్రత్తిపాడులో సైడ్ కాలువలతో పాటు సీసీ రోడ్డు ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ వెంటనే పనులను ప్రారంభించాడు. అయితే ప్రత్తిపాడులో సైడ్ కాలువల నిర్మాణంతో గొట్టిపాడులో బ్రిడ్జిని నిర్మించిన సదరు కాంట్రాక్టర్ ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో అర్ధాంతరంగా పనులు ఆపివేసి వెళ్లిపోయాడు.

అంతలో ఎన్నికలు రావడం, కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గొట్టిపాడు తెలుగుదేశం పార్టీ నాయకులు రోడ్డు విషయంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులును వేడుకుంటూనే ఉన్నారు. ప్రతి కార్యక్రమంలోనూ గొట్టిపాడు రోడ్డు విషయాన్ని ఆయనకు గుర్తు చేస్తూనే ఉన్నారు. దీనిపై సదరు కాంట్రాక్టర్‌తో పలుమార్లు మాట్లాడారు. చివరికి ఇటీవల తిమ్మాపురం వచ్చిన పెమ్మసాని చంద్రశేఖర్ దృష్టికి గ్రామస్థులు ఈ విషయాన్ని తీసుకెళ్లి వినతిపత్రం అందజేశారు. దీనిపై ఈ ఇరువురు నేతలు సదరు కాంట్రాక్టర్‌తో మాట్లాడి బిల్లులు ఇప్పిస్తామని భరోసా ఇవ్వడంతో పనులను ప్రారంభించారు. ప్రత్తిపాడులో సీసీ రోడ్డు ఏర్పాటుకు పనులను బుధవారం ప్రారంభించారు. ప్రత్తిపాడు నుంచి ఉన్నవ వరకు సుమారు 10 కోట్ల రూపాయలతో పనులు జరుగుతున్నాయి. ఆ తరువాత ఉన్నవ నుంచి బోయపాలెం వరకు కూడా నిధులు మంజూరు అయ్యాయి.

నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేయకుంటే పోరుబాట

● రైతుసంఘ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణయ్య

పెదనందిపాడు, మే 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేయకుంటే రైతు సంఘాల ఆధ్వర్యంలో పోరుబాట పడతామని రైతుసంఘ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య అన్నారు. స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞానకేంద్రంలో బుధవారం వివిధ ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ గడిచిన రెండేళ్లుగా పొగాకు గిట్టుబాటు ధర ఉండటంతో అధికశాతం రైతులు ఈఏడాది పొగాకు సాగుచేశారని, వ్యయప్రయాసలుకోర్చి పొగాకు పండించారని, తీరా ఇప్పుడు మద్దతు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కంపెనీ ప్రతినిధులు, సీఎం, వ్యవసాయశాఖ మంత్రులు పండించిన ప్రతి కేజీని కొంటామని.. రైతులు ఆందోళన చేయొద్దని హామీ ఇచ్చారని, కాలయాపన చేస్తున్నారే తప్ప కేజీ పొగాకు కూడా కొనగోలు చేయలేదని ఆరోపించారు. ఈ ప్రాంత తాగుసాగునీటి అవసరాలు తీర్చే గుంటూరు ఛానెల్ పొడిగింపుపై గత ప్రభుత్వం హామీ ఇచ్చింది కానీ నిధులు కేటాయించలేదన్నారు. అధికారంలో ఉన్న కూటమి ఛానెల్ పొడిగింపునకు నిధులు కేటాయించిందని, పనులు ప్రారంభించి ప్రాంత రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నల్లమడ వాగు ఆధునికీకరణకు కూడా నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు పాశం రామారావు, పలు సంఘ నాయకులు దొప్పలపూడి రమేష్‌బాబు, ముద్దన వెంకటేశ్వర్లు, జంపని రామారావు, పసుపులేటి శేషగిరిరావు, కన్నెగంటి చంద్రరావు, గారపాటి రమేష్‌బాబు, నూర్‌బాషా సుభానీసాహెబ్, అన్నలదాసు ఆశీర్వాదం, ఫణిదం భువనేశ్వరి, మద్రి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

వీవోఏ తొలగింపుపై గొట్టిపాడులో డీఎల్‌డీవో విచారణ



గొట్టిపాడు పంచాయతీ కార్యాలయంలో విచారణ చేస్తున్న డీఎల్‌డీవో పిచ్చిరెడ్డి

ప్రత్తిపాడు, మే 29 (ఆంధ్రజ్యోతి): గొట్టిపాడులోని రాధాకృష్ణ గ్రామైఖ్య సంఘంలో వీవోఏను మార్చు చేయడంపై మొదలైన గొడవలు గ్రామంలో తారస్థాయికి చేరాయి. ఈ గ్రామైఖ్య సంఘానికి సంబంధించి వీవోఏ విషయంలో ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆ గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళలు రాస్తారోకో చేయడం, ప్రత్తిపాడు ఏపీఎం లాజరును సస్పెండు చేయాలంటూ డిమాండ్ చేయడం, ఆ సమయంలో అందరి సమక్షంలో వీవోఏను తాను మార్చలేదంటూ పోలీసుల సాక్షిగా ఏపీఎం ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ తరువాత ఏమి జరిగిందో ఏమో కానీ డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి వీవోఏను మార్చినట్లు ప్రకటించారు. దీంతో అక్కడి నుంచి మొదలైన యుద్ధం ఇప్పుడు తారస్థాయికి చేరింది. తమ గ్రామైఖ్య సంఘానికి తెలియకుండా ఏ విధంగా వీవోఏను మారుస్తారంటూ రాధాకృష్ణ గ్రామైఖ్య సంఘం కలెక్టర్‌కు ఆధారాలతో సహా లిఖిత పూర్వకంగా పిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ నాగలక్ష్మి గుంటూరు డీఎల్‌డీవో పిచ్చిరెడ్డిని విచారణాధికారిగా నియమించింది. దీనిపై గురువారం ఆయన స్థానిక పంచాయతీ కార్యాలయంలో డ్వాక్రా సంఘాల లీడర్లను పిలిపించి విచారణ నిర్వహించడంతో పాటు లిఖిత పూర్వకంగా వారి నుంచి అభిప్రాయాలు సేకరించారు. డ్వాక్రా సంఘసభ్యుల నుంచి సేకరించిన అభిప్రాయా లను కలెక్టర్‌కు నివేదిస్తానని ఆయన విచారణాధికారి పిచ్చిరెడ్డి తెలిపారు.

తెనాలి ఘటనను సుమోటోగా స్వీకరించాలి : కేవీపీఎస్

మంగళగిరి, మే 29(ఆంధ్రజ్యోతి): తెనాలి ఐతా నగర్‌లో జరిగిన ఘటనను హైకోర్టు సుమోటోగా స్వీకరించి కేసు నమోదు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్రా మాల్యాద్రి కోరారు. మంగళగిరి టిప్పర్ల బజారులోని షేక్ బాబూలాల్ కుటుంబాన్ని కేవీపీఎస్, డీహెచ్‌పీఎస్ నాయకులు గురువారం పరామర్శించారు. అనంతరం మాల్యాద్రి మాట్లాడుతూ దళిత, మైనార్టీ యువకులపై నడిరోడ్డుపై దారుణంగా వ్యవహరించిన పోలీసులను తక్షణమే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఏ కేసులోనైనా నిందితులకు శిక్షలు అమలు చేసే అధికారం కోర్టు పరిధిలో అంశమని, దానిని ఉల్లంఘించి పోలీసులు నిందితులపై దాడి చేయడం మానవ హక్కుల ఉల్లంఘనేనని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. తెనాలి ఘటనపై ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా దళిత, గిరిజన, మైనార్టీ సంఘాలతో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.సుబ్బారావు, కేవీపీఎస్ నేతలు జే నవీన్‌ప్రకాష్, ఎం రవి, కే ఈశ్వరరావు, జీవీ రాజు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల వద్దే బియ్యం పంపిణీ

● ఇన్‌చార్జ్ తహసీల్దార్ దరియావలి

వట్టిచెరుకూరు, మే 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామాల్లో జూన్ 1వ తేదీ నుంచి రేషన్ కార్డుదారులకు గ్రామాల్లోని రేషన్ షాపుల వద్దనే బియ్యం పంపిణీ చేయనున్నట్టు ఇన్‌చార్జ్ తహసీల్దార్ దరియావలి వెల్లడించారు. ఈ మేరకు గ్రామాల్లోని రేషన్ షాపుల వద్ద ప్రజలకు తెలిసే విధంగా పెద్ద బ్యానర్లతో పాటు గ్రామాల్లోని పలు చోట్ల స్టిక్కర్ల రూపంలో ప్రచారానికి ఏర్పాట్లు చేశారు. నూతనంగా రేషన్ షాపుల వద్ద పంపిణీ నేపథ్యంలో మైకు ద్వారా సమాచారం చేరేలా చూడాలని డీలర్లకు సూచించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : సీఐ

మంగళగిరి సిటీ, మే 29 (ఆంధ్రజ్యోతి): నేటి ఆధునిక యుగంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో వృత్తిదారులు, వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలని మంగళగిరి అర్బన్ సీఐ డి.వినోద్‌కుమార్ సూచించారు. మంగళగిరిలోని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఢిల్లీ ఫౌండేషన్ ఫర్ ఎంఎస్‌ఎంఈ క్లస్టర్, సింగపూర్ ఏషియా ఫౌండేషన్, రామచంద్రాపురం త్రిపాఠి ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం సైబర్ సెక్యూరిటీపై శిక్షణ, వర్క్‌షాపు నిర్వహించారు. స్వర్ణకారులు, చిన్న కుటీర పరిశ్రమల ద్వారా రుణాలు పొందిన లబ్ధిదారులకు సైబర్ సెక్యూరిటీపై అవగాహన కల్పించారు. సీఐ వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఇంటి దగ్గర ఉండి డబ్బులు సంపాదించవచ్చు, ఆన్‌లైన్ ట్రేడింగ్ చేయండి అంటూ వచ్చే సందేశాలను నమ్మవద్దన్నారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్ మాట్లాడుతూ స్వర్ణకారులకు అవగాహన కల్పించి, శిక్షణ ఇచ్చేందుకు ముందుకు వచ్చిన సంస్థల నిర్వహకులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేస్తూ రూపొందించిన ప్లకార్డులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఎంఈ ఫౌండేషన్ స్టేట్ కోఆర్డినేటర్ పీ శ్రీనుబాబు, జిల్లా ట్రైనర్ రమేష్‌బాబు, త్రిపాఠి సొసైటీ కార్య దర్శి కొప్పుశెట్టి త్రిపాఠి, కోశాధికారి పారేపల్లి నారాయణ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వపు విద్యార్థులు

పెదనందిపాడు, మే 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో 1986-87 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం గురువారం జరిగింది. విద్యార్థులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ ఆనందంగా గడిపారు. అనంతరం పూర్వపు విద్యార్థి దాసరి సుబ్బారావు ఆర్థికంగా ఇబ్బందిపడుతున్న ఆళ్ల మల్లేశ్వరికి రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో షేక్ కరీముల్లా, శీలం అంకారావు, సరిమళ్ల చంద్రశేఖర్, నన్నపనేని శ్రీనివాసరావు, తెలగతోటి శ్రీనివాసరావు, నూతి అమర్, కట్టా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు పింఛన్ల పంపిణీ : ఎంపీడీవో రమేష్ బాబు

వట్టిచెరుకూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జూన్ నెలకు సంబంధించి పింఛన్ నగదును లబ్ధిదారులకు ఈ నెల 31వ తేదీనే అందిస్తామని ఎంపీడీవో గురువారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు, ఈ మేరకు పంచాయతీ సెక్రటరీలకు సూచనలు చేసినట్లు ఆయన చెప్పారు.

పాఠశాలలకు పాఠ్యపుస్తకాల పంపిణీ



ప్రధానోపాధ్యాయులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈవో కెన్నడీ, సీఆర్పీలు

కాకుమాను, మే 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యాకిట్లను ఎంఈవో కేఎఫ్ కెన్నడీ పంపిణీ చేశారు. స్థానిక విద్యాశాఖాధి కార్యాలయంలో గురువారం మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన 10023 పాఠ్యపుస్తకాలు, స్కూల్ బ్యాగ్‌లు 2083, నోట్ పుస్తకాలు 13266, అలాగే డిక్షనరీలు 402 సరఫరా చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ పాఠశాలలు పునఃప్రారంభం అయ్యే నాటికి ప్రతి విద్యార్థికి కిట్లు అందాలన్నదే ప్రభుత్వ ధ్యేయం అన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు సురేంద్ర, చలపతిరావు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సినిమా థియేటర్ తనిఖీ



ప్రత్తిపాడులోని మారుతి థియేటర్‌ను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ కరుణకుమార్

ప్రత్తిపాడు, మే 29 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులోని మారుతి థియేటర్ మూత బడినట్టు ప్రత్తిపాడు తహసీల్దార్ కరుణకుమార్ తనిఖీలో బయట పడింది. థియేటర్ మూసివేయాలంటే ముందుగా రెవెన్యూ అధికారులకు సమాచారం అందిచాల్సి ఉంటుంది. అలాంటిది ఏమీ లేకుండా థియేటర్‌ను మూసివేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సినిమా థియేటర్లలో జరుగుతున్న తనిఖీలో బాగంగా ప్రత్తిపాడు తహసీల్దార్ థియేటర్‌ను సందర్శించారు. బయట గేటుకు తాళాలు వేసి ఉన్నాయి. థియేటర్‌ను లీజుకు తీసుకున్న నడుపుతున్న వారికి ఫోన్ చేయగా కొంత కాలంగా థియేటర్‌ను మూసి వేశామంటూ వారు తెలిపారు. దీనిపై ప్రభుత్వానికి నివేదిక ఇస్తానని తహసీల్దార్ తెలియజేశారు.

పెదనందిపాడు, మే 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్ఆర్‌టీ థియేటర్‌ను గురువారం రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు. థియేటర్‌లో ప్రేక్షకులకు కల్పిస్తున్న వసతులపై ఆరా తీశారు. ప్రస్తుతానికి థియేటర్ వినియోగంలో లేనట్లు నిర్వాహకులు తెలిపారు.

అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేయాలి

● మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి సూర్యకుమారి



రాయపాటి శైలజకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సూర్యకుమారి

మంగళగిరి, మే 29 (ఆంధ్రజ్యోతి): పని ప్రదేశాలలో మహిళా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం అంతర్గత ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేయాలని ఏపీ సచివాలయంలోని మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి సూర్యకుమారి కోరారు. ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన రాయపాటి శైలజను గురువారం ఆమె మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. మహిళా కమిషన్ విధివిధానాలు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక తదితర అంశాలపై ఇద్దరూ కొద్దిసేపు చర్చించారు. మహిళల రక్షణ, సమస్యల పరిష్కారం కోసం అవలంబించాల్సిన అంశాలను ప్రస్తావించారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజను సన్మానిస్తున్న వీసీ శారద జయలక్ష్మి

తాడికొండ, మే 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నేటి సమాజంలో చదువుతో పాటు టెక్నాలజీని, నైపుణ్యాలను అందిపుచ్చుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ తెలిపారు. గురువారం ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాల లాంఫాంలోని సామాజిక విజ్ఞాన కళాశాల తొమ్మిదో వార్షిక వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శైలజ మాట్లాడుతూ డిగ్రీ చదివిన తరువాత ఉద్యోగం కోసం వేరే వారి దగ్గరకు వెళ్లకుండా విద్యార్థులు స్వయంగా ఉపాధి అవకాశాలు చూసుకోవాలని అన్నారు. విద్యతో పాటు ఇతర రంగాల్లో పట్టు సాధించి ఆదర్శప్రాయంగా నిలవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం వీసీ శారద జయలక్ష్మి, తెనాలి సబ్ కలెక్టర్ సిన్హా, రిజిస్ట్రార్ రామచంద్రరావు, సామాజిక, విజ్ఞాన కళాశాల అసోసియేట్ డీన్ చైతన్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

కాజలో సంజీవని ఆరోగ్య రథం వైద్య సేవలు



సంజీవని ఆరోగ్య రథం వైద్యశిబిరంలో పాల్గొన్న వైద్య సిబ్బంది, గ్రామస్థులు

మంగళగిరి సిటీ, మే 29 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి ఎమ్మెల్యే, రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంజీవని ఆరోగ్య రథం ద్వారా గురువారం కాజ గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆరో గ్య రథం ద్వారా ప్రతి నెలా ఒకరోజు గ్రామంలో వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు కాజ టీడీపీ అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి గాదె పిచ్చిరెడ్డి, గుంటూరు చానల్ నీటి సంఘాల చైర్మన్ మాణిక్యాల రవి, బూత్ కన్వీనర్లు దొడ్డక గంగరాజు, గోగుల సురేశ్‌కుమార్, డి.నరేష్, డాక్టర్ నవీన్, ల్యాబ్ టెక్నీషియన్ అరుణ, సుచరిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరు వారాలుగా వేతనాలు అందడంలేదు



ఉపాధి హామీ కూలీల సమస్యలను తెలుసుకుంటున్న వ్యకాస జిల్లా కార్యదర్శి బాలరాజు

దుగ్గిరాల, మే 29(ఆంధ్రజ్యోతి): ఆరు వారాలుగా తమకు ఉపాధిహామీ పనులకు సంబంధించి వేతనాలు అందడంలేదని ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద పనులు చేపడుతున్న వ్యవసాయ కూలీలు తమ సమస్యలను వ్యవసాయ కార్మిక సంఘాల నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. మండలంలోని తుమ్మపూడి గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించేందుకు వెళ్లిన జిల్లా వ్య.కా.స కార్యదర్శి జెట్టి బాలరాజుకు కూలీలు వారి సమస్యలను ఏకరవు పెట్టారు. వందరోజుల పనులు కల్పించే అంశాన్ని పరిశీలించాలని, సకాలంలో వేతనాలు కూలీలందరికీ అందేలా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లక్ష్మణరావు, శ్రావణి, కె.శ్రీనివాసరావు, నందయ్యసీతారామయ్య, కూలీలు పాల్గొన్నారు.

రైతు, కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి

● రైతు సంఘ జిల్లా కార్యదర్శి పాశం రామారావు

పెదనందిపాడు, మే 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతు, కౌలురైతుల సమస్యలు పరిష్కరించాలని సంఘ జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో గురువారం రైతు సంఘ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని పెట్టుబడి సాయం కింద రైతులకు, కౌలు రైతులకు కూడా ఇవ్వాలన్నారు. భూయజమానితో పని లేకుండానే కౌలురైతు గుర్తింపుకార్డులు జారీచేసి రుణసౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

మహానాడుకు తరలివెళ్లిన టీడీపీ శ్రేణులు

తెనాలి రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): కడపలో నిర్వహిస్తున్న మహానాడుకు తెనాలి నియోజవర్గం నుంచి పెద్దసంఖ్యలో పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. గురువారం తెల్లవారుజామున వేలాదిగా బస్సులు, కార్లు వంటి వివిధ వాహనాల్లో ప్రయాణమయ్యారు. పసుపు కండువాలు ధరించి తెలుగుదేశం పార్టీ జెండాలను వాహనాలకు కట్టి జై తెలుగుదేశం అంటూ నినాదాలతో ముందుకు సాగారు. పట్టణ, మండల అధ్యక్షులు తాడిబోయిన హరిప్రసాద్, కేసన కోటేశ్వరరావులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

రోగులకు బంధువులే సహాయకులు

- ఎఫ్ఎన్‌వోలు, ఎంఎన్‌వోల కొరత
- పరీక్షలకు బంధువులే తీసుకువెళ్లాల్సిన పరిస్థితి
- పరీక్షా కేంద్రాలు తెలియక సతమతం
- తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో దుస్థితి

తెనాలి రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోనే రెండో అతిపెద్ద ఆసుపత్రిగా పేరుగాంచిన తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల్లో రోగులకు ఇబ్బందులు తప్పడంలేదు. దాదాపుగా 200 పడకలతో వైద్యసేవలందించే ఈ ఆసుపత్రిలో అన్ని రకాల వైద్యులు అందుబాటులో ఉన్నారు. వైద్యం కూడా బాగుంటుందని పేరు ఉండటంతో పేదలు ఎక్కువగా ఈ వైద్యశాలను ఆశ్రయిస్తుంటారు. తెనాలి, కొల్లిపర, వేమూరు, చుండూరు, దుగ్గిరాల, చెరుకుపల్లి, కొల్లిపర, కొల్లూరు, చేబ్రోలు వంటి మండలాల పరిధిలోని పలు గ్రామాల ప్రజలు అనారోగ్య సమస్యలకు చికిత్స పొందేందుకు రాకపోకలు సాగిస్తుంటారు. వ్యాధి తీవ్రతను బట్టి వైద్యులు వైద్యశాల వార్డుల్లోనే ఉండి చికిత్స పొందేందుకు సూచిస్తారు. ఈ క్రమంలోనే పరీక్షలు చేయించుకునేందుకు రోగులను వార్డుల నుంచి ఎక్స్‌రే, రక్త, యూరిన్ వంటి పరీక్షలకు తీసుకువెళ్లేందుకు అవసరమైన ఎఫ్ఎన్‌వోలు, ఎంఎన్‌వోలు అందుబాటులో ఉండకపోవడంతో రోగిసహాయకులే వారిని తీసుకువెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో రోగిని ట్రైసైకిల్, స్ట్రెచర్లపై తీసుకుని పరీక్ష కేంద్రాలకు రోగి సహాయకులే తీసుకువెళ్తూ కనిపిస్తారు. కొందరికి ఆసుపత్రిలో పరీక్ష కేంద్రాలు తెలియక సతమతమయ్యే పరిస్థితి కూడా లేకపోలేదు. అందులో కొందరు రోగులకు సెలైన్, యూరిన్ ట్యూబ్ వంటివి అమర్చి ఉండటంతో రోగిని పరీక్షలకు తీసుకువెళ్లే సమయంలో ఏ మాత్రం పొరపాటు జరిగినా కొత్తసమస్యకు దారితీసే ప్రమాదం ఉంది. వైద్యశాల ఓపీ వద్ద కూడా వచ్చే రోగులకు వార్డులకు ఎలా వెళ్లాలి, వైద్యసహాయం ఎలా పొందాలి, పరీక్షా కేంద్రాలు ఎక్కడ ఉంటాయన్న వివరాలను తెలిపేందుకు సిబ్బంది సైతం అందుబాటులో ఉండటంలేదన్న విమర్శలు కూడా ఉన్నాయి. వైద్యశాలకు వచ్చే పేద రోగులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బందిని నియమించాలని పలువురు కోరుతున్నారు.



భర్తను వైద్యపరీక్షలకు తీసుకువెళుతున్న వృద్ధురాలు


మే పుష్పం

వికసించిన మే పుష్పం

తెనాలి అర్బన్, మే 29 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం సంగం జాగర్లమూడిలో మే పుష్పం విరబూసింది. ఉపాధ్యాయుడు బట్టు వెంకయ్య గృహంలో పెంచుతున్న మొక్కల్లో గురువారం పువ్వు పూసినట్లు తెలిపారు.

'పోలీసులు చట్టాన్ని అతిక్రమించకూడదు'

తెనాలి అర్బన్, మే 29 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్ల విషయంలో చట్టాన్ని పోలీసులు అతిక్రమించకూడదని హైకోర్టు న్యాయవాది జైభీమారావు చెప్పారు. హైకోర్టు న్యాయవాదుల సంఘం సభ్యులు గురువారం ఐతానగర్‌లో రౌడీషీటర్ల కుటుంబ సభ్యులను పరామర్శించారు. సంఘటన వెనుక కారణాలను సమీక్షించి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. పోలీసులు చట్టాన్ని చేతిలోకి తీసుకుని కొట్టడం సరికాదని, రిమాండ్‌కు పంపించడమే పోలీసుల విధి అని చెప్పారు. మరో న్యాయవాది సురేష్‌కుమార్ మాట్లాడుతూ, మానవ హక్కుల సంఘం స్పందించి ఈ ఘటనను సుమోటోగా స్వీకరించి విచారణ చేయాలని కోరారు. కేవీ రత్నం, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- మునిసిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట,మే 29 (ఆంధ్రజ్యోతి): యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం, మానసిక దృఢత్వం సాధ్యమౌతుందని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న అన్నారు. గురువారం కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న యోగా మాసోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణా శిబిరాలలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పాల్గొని మాట్లాడారు. ఈ నెల 21వ తేదీ నుంచి జూన్ 21 వరకు అన్ని పట్టణాల్లో రాష్ట్రవ్యాప్తంగా యోగా మాసోత్సవాలు జరుగుతున్నాయన్నారు. యోగా ఆసనాల వలన విద్యార్థుల్లో ఏకాగ్రత పెరుగుతుందని ఆరోగ్యానికి, మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయన్నారు. పట్టణ ప్రజలు యోగా శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరురు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిషత్ నాటిక పోటీల్లో తెనాలి కళాకారులకు బహుమతులు

తెనాలి అర్బన్, మే 29 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ కళా పరిషత్ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా సాతులూరులో జరిగిన నాటికల పోటీల్లో తెనాలి కళాకారులు బహుమతులు అందుకున్నారు. అద్దేపల్లి ఆరాధ్యుల ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన ఎవరు సాంఘిక నాటికలో ఉత్తమ బాలనటి, ఉత్తమ ప్రదర్శన బహుమతులను గెలుచుకుందని దర్శకుడు అద్దేపల్లి లక్ష్మణశాస్త్రి తెలిపారు. ఆరాధ్యుల తేజస్వి ప్రఖ్య రచించిన నాటిక మొదటి ప్రదర్శనలోనే రెండు బహుమతులు గెలుచుకోవడంపై పలువురు కళాకారులు అభినందించారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

తెనాలి, మారీసుపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని అన్నదాత సుఖీభవ సభ్యులు నిర్వహించారు. గురువారం స్థానిక గాంధీనగర్‌లోని శ్రీషిరిడి సాయి వృద్ధాశ్రమంలో అన్నదాత సుఖీభవ సభ్యులు కొడాలి సాంబశివరావు, అహల్య దంపతుల 41వ వివాహ వార్షికోత్సం సందర్భంగా వారి కుటుంబ సభ్యులు సహకారంతో ఆశ్రమంలోని వృద్ధులకు ఆహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుర్రా శ్రీనివాసరావు, ప్రతాప్, రజాక్, ఆశ్రమ నిర్వాహకులు సత్యనారాయణ, సునీత తదితరులు పాల్గొన్నారు.

తెనాలి ఘటనపై హైకోర్టు సుమోటోగా స్వీకరించాలి: ఆంద్రా

మంగళగిరి, మే 29 (ఆంధ్రజ్యోతి): తెనాలి అయితా నగర్‌లో జరిగిన ఘటనను హైకోర్టు సుమోటోగా స్వీకరించి కేసు నమోదు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంద్రా మాల్యాద్రి కోరారు. మంగళగిరి టిప్పర్ల బజారులోని షేక్ బాబూలాల్ కుటుంబాన్ని కేవీపీఎస్, డీహెచ్‌పీఎస్ నాయకులు గురువారం పరామర్శించారు. అనంతరం మాల్యాద్రి మాట్లాడుతూ దళిత, మైనార్టీ యువకులపై నడిరోడ్డుపై దారుణంగా వ్యవహరించిన పోలీసులను తక్షణమే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

ఏమయ్యా ఎస్పీ నీకు బుద్ధుందా! సిగ్గుందా?

- మాజీ ఎంపీ హర్షకుమార్ వివాదాస్పద వ్యాఖ్యలు
- తెనాలిలో రౌడీషీటర్‌ల కుటుంబాలకు పరామర్శ
- ముగ్గురిని కొట్టిన సీఐలపై చర్యలకు డిమాండ్

తెనాలి, మే 29, (ఆంధ్రజ్యోతి): 'యువకులను కొట్టిన సీఐలకు ఆ ఎస్పీగాడి సపోర్ట్... ఏమయ్యా ఎస్పీ నీకు బుద్ధుందా? అంటూ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ హర్షకుమార్ పోలీసులపై ఘాటయిన వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. గురువారం గుంటూరు జిల్లా తెనాలి ఐతానగర్ వచ్చిన ఆయన ఇటీవల పోలీసులు బహిరంగంగా లాఠీ దెబ్బలు కొట్టిన రౌడీ షీటర్లు దోమా రాకేష్, చేబ్రోలు జాన్ విక్టర్‌ల కుటుంబాలను పరామర్శించారు. తర్వాత విలేకరులతో మాట్లాడారు. ముగ్గురు యువకులను నడి రోడ్డుపై పోలీసులు కొట్టడం దారుణమన్నారు. ఒక్క గుంటూరు జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా దళితులు, మైనారిటీలను హింసించాలనే ఒక అజెండా రూపుదిద్దుకుందన్నారు. ప్రవీణ్ పగడాల కేసు విషయంలోనూ ఇలానే వ్యవహరించారన్నారు. ఆయనది కచ్చితంగా హత్యేనని, దానిని యాక్సిడెంట్‌గా చూపించడం కోసమే పోలీసులు ఇన్వెస్టిగేషన్ చేశారన్నారు. దీనికి సంబంధించిన ఆధారాలన్నీ వెల్లడించేందుకు మీటింగ్ పెడితే అడ్డుకున్నారని, 'దమ్ముంటే పోలీసులను నాపై కేసు పెట్టమని అడిగానని, వారికి దమ్ములేదని, అందుకే కేసు పెట్టలేకపోయారన్నారు'. అని అన్నారు. అంతటితో ఆగకుండా ఆ ఎస్పీ గాడు అంటూ సంబోధించారు. ఎస్పీకి చట్టం, న్యాయం ముఖ్యం కాదని, కేంద్ర, రాష్ట్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, నాదెండ్ల మనోహర్ ఏది చెబితే అదే ఆయనకు చట్టమా అని మండిపడ్డారు. నడి రోడ్డుపై యువకులను కొట్టి చట్టాన్ని మీ చేతుల్లోకి తీసుకునేటప్పుడు ఇంక కోర్టులు ఎందుకు! వాటిని కూడా మూసెయ్యాలన్నారు. వారం సమయం ఇస్తున్నామని, ఆ ఇద్దరు సీఐలపై చర్యలు తీసుకోవాలని, ఈ కేసు విషయంలో సిటింగ్ జడ్జితో విచారణ జరిపించకుంటే ఛలో తెనాలికి పిలుపిచ్చి మళ్లీ తెనాలి వచ్చి ఆమరణ నిరాహార దీక్ష చేస్తానన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ హర్షకుమార్


పాఠ్య పుస్తకాలను వ్యాన్‌లో ఎక్కిస్తున్న విద్యాశాఖ సిబ్బంది

పాఠశాలలకు విద్యా కిట్లు

- ఎంఈవో ఝాన్సీలత

కొల్లిపర, మే 29 (ఆంధ్రజ్యోతి): స్కూల్స్ జూన్ 12వ తేదీ నుంచి మరల ప్రారంభం కావటంతో మండలంలోని అన్ని పాఠశాలలకు విద్యార్థులకు సంబంధించిన పాఠ్య, నోట్ పుస్తకాలు, బ్యాగులు ఆయా ప్రధానోపాధ్యాయులకు అందజేస్తున్నట్లు ఎంఈవో ఝాన్సీలత తెలిపారు. గురువారం మండల కేంద్రం కొల్లిపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ సిబ్బంది విద్యార్థులకు సంబంధించిన విద్యార్థి కిట్స్‌ను ఎంఈవో ఝాన్సీలత ఆధ్వర్యంలో వ్యాన్‌ల ద్వారా మండలంలోని పాఠశాలలకు తరలించారు. ఈ సందర్భంగా ఝాన్సీలత మాట్లాడుతూ 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు సంబంధించిన పాఠ్య, నోట్ పుస్తకాలు, బ్యాగులు మండలంలోని పాఠశాలలకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ప్రధానోపాధ్యాయులు స్కూల్స్ ప్రారంభించిన వెంటనే విద్యార్థులకు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యా కిట్ కమిటీ సభ్యులు ఎంఐఎస్ రమేష్, సీఆర్పీలు పిడపర్తి రమేష్ బాబు, వి.మురళి, అలేఖ్య, స్వరూపరాణి, రాంబాబు, సురేష్, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

బాకీ డబ్బులు ఇస్తానని.. వ్యక్తిపై దాడి, దోపిడీ

గుంటూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): బాకీ డబ్బులు ఇస్తానని షాపునకు పిలిపించి, దాడిచేసి కొట్టడమే కాకుండా అతని బ్యాంక్ ఖాతాలోని నగదును ఫోన్‌పే ద్వారా తన ఖాతాకు బదిలీ చేయించుకున్న ఘటనపై నగరంపాలెం పోలీస్ స్టేషన్లో కేసు నమోదయింది. పోలీసుల కథనం మేరకు.. కొత్తపేటకు చెందిన విశ్రాంత బ్యాంకు ఉద్యోగి ఘంటసాల ఆనందరాజు తనకు పరిచయమైన మస్తాన్ దర్గా ప్రాంతానికి చెందిన కోనా శ్రీనివాసరావుకు రూ.5లక్షలు అప్పుగా ఇచ్చాడు. శ్రీనివాసరావు రూ.లక్షన్నర అప్పు తీర్చాడు. మిగిలిన బకాయి డబ్బులు ఇవ్వాలంటూ శ్రీనివాసరావును ఆనందరాజు అడుగుతున్నాడు. ఈ నెల 26న శ్రీనివాసరావు ఆనందరాజు కుమారుడు గోపీకి ఫోన్‌చేసి బాకీ డబ్బులు ఇస్తానని, షాప్‌కు వచ్చి తీసుకెళ్లాలని చెప్పాడు. దీంతో గోపి మస్తాన్ దర్గా వెనుక ఉన్న శ్రీనివాసరావు హార్డ్వేర్ షాప్‌కు వచ్చాడు. అక్కడ శ్రీనివాసరావుతో పాటు మరో ముగ్గురు గోపిపై దాడిచేసి కొట్టడమే కాకుండా ఆయన సెల్‌ఫోన్ లాక్కున్నారు. ఖాతా నుంచి రూ.4లక్షల నగదు తమకు సంబంధించిన వారి ఖాతాకు బదిలీ చేయించుకున్నారు. అంతేగాక రెండు ఉంగరాలను కూడా తీసుకున్నారు. కొత్తపేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

టీవీలు, ఏసీలు చోరీ

అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని బ్రాడీపేట మెయిన్ రోడ్డుపై ఉన్న గ్రాండ్ నాగార్జున హోటల్లో దొంగలు పడ్డారు. శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణం నేపథ్యంలో రెండు నెలల క్రితం హోటల్‌ను తాత్కాలికంగా మూసివేశారు. అయితే గడిచిన మూడు రోజులుగా హోటల్లోని గదులలో ఉన్న 14 టీవీలు, 4 ఏసీలను కూడా అపహరించారు. హోటల్ సూపర్ వైజర్ నాగార్జున ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


గోళ్ళమూడిలో చెరువును పరిశీలిస్తున్న ఉపాధి హామీ పథకం రాష్ట్ర డైరెక్టర్ షణ్ముఖ కుమార్, పక్కన ఇతర అధికారులు

గోళ్ళమూడి చెరువును మోడల్‌గా అభివృద్ధి చేయాలి

- ఉపాధి హామీ పథకం రాష్ట్ర సంచాలకులు షణ్ముఖ కుమార్

పెదకాకాని, మే 29 (ఆంధ్రజ్యోతి): గోళ్ళమూడి మంచినీటి చెరువును మోడల్‌గా అభివృద్ధి చేయాలని ఉపాధి హామీ పథకం రాష్ట్ర డైరెక్టర్ వైవీ షణ్ముఖ కుమార్ ఆదేశించారు. గురువారం ఆయన పెదకాకాని మండలం ఉప్పలపాడు, గోళ్ళమూడి గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా షణ్ముఖ కుమార్ మాట్లాడుతూ గోళ్ళమూడి గ్రామంలోని తాగునీటి చెరువును పల్లె పుష్కరిణి కింద చేపట్టాలని సూచించారు. ఉప్పలపాడు గ్రామంలో పంట కుంట తవ్వుతున్న తీరును పరిశీలించారు. ఈ పనులపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. శ్రామికులకు రోజువారీ వేతనం కనీసం 290 రూపాయలు ఉండేలా చూడాలన్నారు. పంట కుంట నిర్మాణం చేపట్టిన రైతులతో మాట్లాడి సూచన చేశారు. పంట కుంట కట్టలపై పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు పెంచడం ద్వారా మరింత ఆదాయాన్ని పొందవచ్చన్నారు. కుంటలో చేపల పెంపకం కూడా చేపట్టవచ్చన్నారు. అనంతరం లాలుపురం గ్రామంలో పర్యటించారు. కార్యక్రమంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ వి.శంకర్, ఎంపీడీవో శ్రీనివాస నాయక్, రూరల్ ఎంపీడీవో బండి శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.


కొల్లిపర సమీపంలో పంటకాల్వలో పూడిక తీస్తున్న పొక్లెయిన్

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- డీసీ వైస్ చైర్మన్ తోట ఏడుకొండలు

కొల్లిపర, మే 29 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని డీసీ వైస్ చైర్మన్ తోట ఏడుకొండలు అన్నారు. గురువారం మండల పరిధిలోని మున్నంగి, కొల్లిపర, చివలూరు, దావులూరు, వల్లభాపురం పంటపొలాల్లో కాల్వల పూడికతీతకు రూ.15లక్షలు మంజూరు కావటంతో నీటి సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులు ప్రొక్లెయిన్ ద్వారా పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడుకొండలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నీటి సంఘాలు ఏర్పాటు చేయడం వలన రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. సంవత్సరాల తరబడి పంట కాల్వలు పూడికతీత పనులు నోసుకోకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులకు గురైనట్లు తెలిపారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పంట కాల్వల పూడికతీత పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నీటి సంఘ అధ్యక్షుడు బి.శ్రీరాములరెడ్డి, కోటా వీరాంజనేయులు, నీటి సంఘం ఉపాధ్యక్షుడు జొన్నల నాగిరెడ్డి, కట్టా శ్రీహరిరెడ్డి, ఆరిమండ శివనాగమల్లేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గాలులతో వర్షం... జలమయమైన రోడ్లు

కొల్లిపర, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం సాయంత్రం ఒక్కసారిగా మబ్బులు కమ్ముకొచ్చి గాలులతో కూడిన వర్షం పడింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఎడతెరిపిలేకుండా వర్షం పడటంతో మురుగు కాల్వలు స్తంభించాయి. భారీ వర్షం కారణంగా వల్లభాపురం, మున్నంగి, పిడపర్రు, పిడపర్తిపాలెం తదితర గ్రామాల్లో రోడ్లన్నీ నీటితో నిండిపోయాయి. దీంతో ప్రజలు పలు ఇబ్బందులకు గురయ్యారు. మండల కేంద్రం కొల్లిపరలో కురిసిన వర్షానికి ప్రధాన రహదారులతో పాటు రోడ్లన్నీ జలమయమయ్యాయి. మురుగు కాల్వలు స్తంభించి రోడ్లపై ప్రవహించటంతో వాహనదారులు పలు ఇబ్బందులకు గురయ్యారు.


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న తదితరులు

డ్రెయిన్లలో పూడికతీత వేగవంతం చేయండి

- మునిసిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట,మే 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డ్రెయిన్లలో పేరుకుపోయిన మురుగు, చెత్త పూడికతీత పనులను వేగవంతం చేయండని పారిశుధ్య కార్మికులను మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. గురువారం స్థానిక రామలింగేశ్వరపేట డిపో రోడ్డు సెంటర్‌లో డ్రెయిన్లలో పూడికతీత ప్రత్యేక డ్రైవ్‌ను మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ శేషన్న మాట్లాడుతూ ప్రజలు చెత్తను డ్రెయిన్లలో వేయడం వలన భారీగా మురుగు పేరుకొనిపోయి నీటి పారుదల జరగక పలు ప్రాంతాలలలో దుర్వాసన వస్తోందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

రేపు ఓంకార ఆశ్రమంలో విగ్రహాల ప్రతిష్ఠ

తెనాలి అర్బన్, మే 29 (ఆంధ్రజ్యోతి): బుర్రిపాలెం రోడ్డులో నిర్మించిన ఓంకార ఆశ్రమంలో విగ్రహ ప్రతిష్ఠ పూజల కార్యక్రమం శనివారం నిర్వహించనున్నారు. గురువారం నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వర పూజ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అంకురారోపణ, కుంభస్థాపన, ప్రతిష్ఠాపన, హోమాలలో భక్తులు, అర్చకులు పాల్గొన్నారు.

పశువులు, గోవులను రక్షించుకోవాలి

- బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర కోశాధికారి టీవీఎస్‌వీ ప్రసాద్

పొన్నూరు టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి): పశువులను, గోవులను రక్షించుకోవాలని, ఇది సమాజంలో ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర కోశాధికారి పులపాక వెంకటసత్యసాయి వరప్రసాద్ (టీవీఎస్‌వీ ప్రసాద్) అన్నారు. జూన్ 7న జరిగే బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని జంతువధ నిషేధ చట్టం అమలు చేయాలని కోరుతూ గురువారం పొన్నూరులో సంఘ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీవీఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల వధ జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గోరక్ష ప్రముఖ్ మన్నవ చలపతిరావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు గోవధ నిషేధం అమలు జరపాలని కోరుతూ అర్జీలు అందించనున్నట్లు తెలిపారు. ఈ విషయంపై గ్రామ పెద్దలు, పూజారులు, విశ్వహిందూ పరిషత్ నేతృత్వంలో సభలు నిర్వహించి రైతులను చైతన్యవంతులను చేయాలని కోరారు. ఇప్పటికే పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం, తాళ్లచెరువు, బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం వంటి పలు ప్రాంతాల్లో చైతన్య సభలు నిర్వహించడం జరిగిందన్నారు. గోశాలల ద్వారా గోవులను సంరక్షించుకునేలా ప్రలు గ్రామాల్లో అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. సమావేశంలో సీహెచ్ఎల్ఎన్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.